www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



## ఐనవోలు బ్రహ్మోత్సవాలకు సిఎంకు ఆహ్వానం

హైదరాబాద్,జనవరి5(వార్త వేదిక సూర్య): ఐనవోలు మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం పలికారు. సిఎంను సోమవారం కలిసిన మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఆహ్వానపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఐనవోలు పూజారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆశీర్వచనం అందించారు.

యాదాద్రి భువనగిరి | మంగళవారం 06, జనవరి 2026 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 226 | పేజీలు: 08 | వెల: 5/-



## దేవుడిని వదలకపోవడం దారుణం

◆ శబరిమల బంగారం మాయం కేసులో సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ,జనవరి5(వార్త వేదిక సూర్య): శబరిమల బంగారం తాపడాల కేసులో సోమవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేవుడినీ వదిలిపెట్టలేదంటూ ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్ పిటిషన్‌ను కొట్టివేసింది. కనీసం దేవుడు, ఆలయం జోలికివెళ్లకుండా ఉండాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో శంకర్‌దాస్ కూడా బాధ్యులేనని పేర్కొంది. ప్రముఖ శబరిమల ఆలయంలో బంగారం అదృశ్యం వ్యవహారంపై దర్యాప్తు

మిగతా 2లో..



## పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాం

ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి లేఖ రాశాం

◆ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జనవరి5(వార్త వేదిక సూర్య): పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిస్తున్న లేఖ ఈ ప్రాజెక్టులకు సంబంధించినది కాదని క్లారిటీ ఇచ్చారు. పోలవరం- నల్లమల్ల ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి తామే

మిగతా 2లో..





# వరద జలాలను దోచుకున్న ఏపీ..!?

### వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు..?

### 480 టీఎంసీలకు మించి వాడుకునేందుకు ఏపీ ప్రయత్నం

### సుప్రీంలో తెలంగాణ వాదనలు

న్యూఢిల్లీ,జనవరి5(వార్త వేదిక సూర్య): గోదావరిలో వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు పెట్టాలని ఏపీ ప్రయత్నిస్తోందని సుప్రీంకోర్టులో తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ నిర్మిస్తున్న పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు కేసు విచారణ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం ఎదుట జరిగింది. తెలంగాణ తరఫున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. నల్లమల సాగర్ ద్వారా గోదావరి జలాల్లో అవార్డు ప్రకారం కేటా యించిన 480 టీఎంసీలకు మించి వాడుకునేం దుకు ఏపీ ప్రయత్నిస్తోందన్నారు. వరద జలాల పేరుతో నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 200 టీఎంసీలు తరలించేందుకు ఏపీ ప్రయత్నిస్తు న్నదని చెప్పారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, అనేక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. వరద జలాలు అనేది ఎక్కడా లేదని అన్నారు. ముఖ్యంగా గోదావరి నదిలో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల నీటి వాటాకు ఈ ప్రాజెక్టు వల్ల ముప్పు పొంచి ఉందన్నారు. కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఏపీ పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని

మిగతా 2లో..




## మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

◆ మరిన్ని టారిఫ్‌లు విధిస్తానంటూ హెచ్చరికలు

వాషింగ్టన్,జనవరి5(వార్త వేదిక సూర్య): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. రష్యాతో భారత్ స్నేహంగా ఉండటాన్ని.. మరీ ముఖ్యంగా చమురు దిగుమతి చేసుకోవటాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా రష్యా నుంచి భారత్‌ను దూరం చేయాలని భావిస్తు న్నారు. అధిక సుంకాలు విధిస్తామంటూ బెదిరిం పులకు దిగుతున్నారు.

మిగతా 2లో..



## అమెరికాలో తెలుగు యువతి దారుణ హత్య

మాజీ ప్రియుడు నివాసంలోనే నిఖితా రావు గొడిశాల మృతదేహం

దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. భారత్ ఎంబసీకి సమాచారం

చెన్నైలో అర్జున్ శర్మను అరెస్ట్ చేసిన పోలీసులు

న్యూఢిల్లీ,జనవరి5(వార్త వేదిక సూర్య): అమెరికాలోని మేరీల్యాండ్‌లో తెలుగు యువతి దారుణ హత్యకు గురైంది. హోవర్డ్ కౌంటీలోని ఎలికాట్ సిటీకి చెందిన

మిగతా 2లో..

## మహిళా సాధికారితకు పెద్దపీట



◆ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి
◆ ఉచిత బస్సుతో మహిళలకు దక్కిన భరోసా
◆ ప్రతి మహిళను సభ్యురాలుగా చేర్చాలన్నదే లక్ష్యం
◆ ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం వడ్డీలేని రుణాలు
◆ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సీతక్క సమాధానం

హైదరాబాద్,జనవరి5(వార్త వేదిక సూర్య): మహిళా సాధికారతకు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై సభ్యులు ప్రశ్న లేవనెత్తగా.. మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ప్రతి మహిళ ఎస్‌జీహెచ్

మిగతా 2లో..

## వ్యక్తిగా వెళుతున్నా.. శక్తిగా తిరిగి వస్తా

బిఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు

ప్రశ్నిస్తే..కారణం లేకుండా బయటకు పంపారు

హరీష్ రావు అవినీతికి అంతు లేదు

సిద్దిపేట తదితర కలెక్టరేట్లు ఒక్క వానకే కూలాయి

కింది నాయకులు దురాగతాలను పట్టించుకోని కెసిఆర్

ఇదే నాచివరి ప్రసంగం అంటూ మండలిలో భావోద్వేగంతో కన్నీరు

కొత్త రాజకీయ వేదిక రాబోతోందంటూ పార్టీపై కవిత వెల్లడి



హైదరాబాద్,జనవరి5(వార్త వేదిక సూర్య): బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై కక్షతో బిజెపి నన్ను జైలులో పెట్టించిందని ఆరోపించారు. శాసనమండలిలో ఇదే తన చివరి ప్రసంగం అంటూ మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత.. సంచలన కామెంట్స్ చేశారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కవిత శపథం చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ

మిగతా 2లో..

## వ్యవస్థలో సమూల మార్పులతో అన్నదాతకు విద్యుత్ వెలుగులు!



◆ మూడేళ్లలో 3.44 లక్షల వ్యవసాయ కనెక్షన్ల మంజూరు
◆ రంగంలోకి విద్యుత్ అంబులెన్స్‌లు.. 1912కు ఫోన్ చేస్తే చాలు పరిష్కారం
◆ ప్రజా బాట ద్వారా క్షత్రస్థాయిలో సమస్యల పరిష్కారం
◆ శాసనమండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,జనవరి5(వార్త వేదిక సూర్య): రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని పటిష్ఠం చేస్తూ, రైతులకు, సామాన్య ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్త రాల సమయంలో విద్యుత్ శాఖపై జరిగిన చర్చకు ఆయన సుదీర్ఘంగా సమాధానమిచ్చారు.

గత ప్రభుత్వాల హయాంలో పేరుకుపోయిన సమస్య లను పరిష్కరిస్తూనే, ఆధునిక సాంకేతికతతో విద్యుత్ శాఖను ప్రజల ముంగిటకే తీసుకెళ్తున్నామని ఆయన వివరించారు. 2022 జనవరి నుంచి 2025 డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, ఏకంగా 3,44,462 మంది రైతులకు కొత్త విద్యుత్ కనెక్షన్లు కల్పించినట్లు తెలిపారు. కన్టైడ్ లోడ్ కనెక్షన్ల అనుగుణంగా 75,686 కొత్త ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. సీనియారిటీని ప్రాతిపది కన తీసుకుని ఎక్కడా వివక్ష లేకుండా కనెక్షన్లు ఇస్తున్నామని, మరో 9,700 మంది రైతులకు లైన్ పనులు పూర్తి కాగానే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గడిచిన రెండేళ్లలో (2024, 2025) దాదాపు 2 లక్షల అదనపు కనెక్షన్లు ఇవ్వడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

### అంబులెన్స్ తరహాలో విద్యుత్ సేవలు

విద్యుత్ అంతరాయం కలిగితే గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా, ః108ః తరహాలో విద్యుత్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, థర్మల్ విజన్ మెరాలు, సేఫ్టీ గేర్ బాక్సులతో కూడిన వాహనం క్షత్రస్థాయికి చేరుకుంటుందని తెలిపారు. ఈ వాహనంలో ఒక ఇంజనీర్ మరియు ఇద్దరు సిబ్బంది ఉండి యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరిస్తారని వివరించారు.

### ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్ల కొరత లేదు

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు లేదా వైర్ల కొరత లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఃప్రజా బాటః కార్యక్రమంలో అధికారులు వారానికి మూడు రోజులు పొలాల్లోనే ఉండి వంగిన స్తంభాలను, వేలాడుతున్న తీగలను సరిచేస్తున్నారని చెప్పారు. సభ్యులు ఏదైనా సమస్యను లిఖితపూర్వకంగా తన దృష్టికి తెస్తే, కేవలం 24 గంటల్లోనే పరిష్కరిస్తామని సభలో ధీమా వ్యక్తం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట

### ప్రభుత్వ పటిషన్ కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం



న్యూఢిల్లీ,జనవరి5(వార్త వేదిక సూర్య): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్పీని సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ సుప్రీం కోర్టులో తెలంగాణ సర్కార్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అయితే గతంలోనే తన ఫోన్‌ను ట్యాప్

మిగతా 2లో..




## మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ!

◆ ఆ 17 మందే మాత్రమే మిగిలారు
◆ చేతిలో జాబితా ◆ పోలీసులు స్పష్టీకరణ
◆ ఇప్పటికైనా లొంగిపోవాలని డిజిపి విజ్ఞప్తి

హైదరాబాద్,జనవరి5(వార్త వేదిక సూర్య): భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా నక్సలిజాన్ని రూపుమాపేందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ కగార్ణ అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. ఈ ఆపరేషన్ ప్రభావంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గు తుండగా, తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు

మిగతా 2లో..




## బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు ప్రజలతో మమేకమవ్వాలి

◆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామ్ చందర్ రావు

హైదరాబాద్,జనవరి5(వార్త వేదిక సూర్య): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్ చందర్ రావు అధ్యక్షతన బూత్ నిర్మాణ అభియాన్ రాష్ట్ర స్థాయి కార్యశాల ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో రానున్న మున్సిపల్, జీహెచ్‌ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని,

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# కోతుల స్వైర్ధ విహారం...

## బైక్ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు. .



మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య): మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద రోజు రోజుకూ మితిమీరిపోతోంది. కోతుల గుంపులు రహదారుల పైకి ఒక్కసారిగా దూసుకువస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాపాయస్థితికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 8:45 గంటల ప్రాంతంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మున్సిపల్ కేంద్రంలోని జంగాల కాలనీకి చెందిన సిరిపాటి ఆనంద్ అనే యువకుడు(25) తన ద్విచక్ర వాహనంపై పోతాయిగడ్డకు వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఉన్నత పాఠశాల ముందున్న రహదారిపైకి కోతులు గుంపు ఒక్కసారిగా అడ్డుగా వచ్చాయి. బైకును తప్పించుకునే క్రమంలో కోతులు బైక్‌ను తాకడంతో వాహనం అదుపుతప్పి క్రింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆనంద్‌కు తలతో పాటు చేతులకు బలమైన గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, బాధితుడిని లక్ష్మనర్సింహ్మా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని చేయి విరిగినట్టుగా సమాచారం. తెలుస్తోంది...పట్టణంలో కోతుల సంచారం విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. కేవలం రహదారుల మీదనే కాకుండా, కోతులు ఇళ్లలోకి చొరబడి నిత్యావసర వస్తువులను పాడుచేస్తున్నాయని, చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులకు తెగబడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ విషయంపై .అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, కోతులను నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మోత్కూరు పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే భారత్‌నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న చాలా వస్తువులపై 50 శాతం టారిఫ్‌లు విధించారు. భారత వ్యాపారాన్ని దెబ్బ తీసేలా దారుణంగా వ్యవహరిస్తున్నారు. మరోసారి భారత్, రష్యా వాణిజ్య ఒప్పందాలపై ఆయన ఫైర్ అయ్యారు.

మేరకు వైట్ హౌస్.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంబంధించిన ఆడియోను సోమవారం మీడియాకు విడుదల చేసింది. ఆ ఆడియోలో ఏముందంటే..' అమెరికాతో భారత్ వాణిజ్య లావాదేవీలు కొనసాగిస్తోంది. భారత్ వాణిజ్య లావాదేవీలపై త్వరలో సుంకాలు పెంచుతా. భారత్ నన్ను సంతోషపెట్టాలని కోరుకుంటోంది. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ప్రధాని మోదీకి తెలుసు. నన్ను సంతోషపెట్టడం భారత్‌కు చాలా ముఖ్యం' అని చెప్పుకొచ్చారు. కాగా, గతంలో భారత్‌పై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించింది. ఇందులో 25 శాతం టారిఫ్‌లు కేవలం రష్యాతో ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న కారణంగా విధించింది. డొనాల్డ్ ట్రంప్ చెబుతున్న దాని ప్రకారం అమెరికా అత్యధిక టారిఫ్‌లు వేసిన దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో బైలటెరల్ ట్రేడ్ అగ్రిమెంట్స్ (బీటీఏ) చేసుకోవాలని ఇండియా చూస్తోంది. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది.భారత్‌పై మరిన్ని టారిఫ్‌లు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌లను మరింత పెంచనున్నట్లు తెలిపారు. ఎ÷-లోరిడా నుండి వాషింగ్టన్ డిసికి వెళ్లే మార్గంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోడీ మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం ముఖ్యం. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. మేము మరిన్ని టారిఫ్‌లను విధిస్తాం' అని పేర్కొన్నారు. ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల కారణంగానే భారత్ ఇప్పుడు రష్యన్ చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గించిందని అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్‌తో పాటు లిండ్సే గ్రాహం కూడా ఉన్నారు. రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాల దిగుమతులపై 500శాతం టారిఫ్‌లు విధించే టారిఫ్ బిల్లు గురించి గ్రాహం వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలంటే, రష్యా భాగస్వామ్యులపై ఒత్తిడి తీసుకురావాలని గ్రాహం పేర్కొన్నారు. ఆంక్షలు రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. రష్యా చమురును కొనుగోలు చేసినందుకే భారత్‌పై అమెరికా 25శాతం సుంకం విధించిందని అన్నారు.

# మహిళా సాధికారితకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

సభ్యురాలుగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి పండు ముదుసలి వరకు మహిళా సంఘం సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 250 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ, పెట్టుబడి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. పట్టణ ప్రాంతాల్లో 130 క్యాంటీన్లు చేసినట్లు వివరించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇది మహిళలకు భద్రతతో పాటు ఆర్థికంగా ఉపశమనాన్ని కలిగించే కీలక నిర్ణయమని పేర్కొన్నారు. మహిళల రోజువారీ జీవనాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన అవకాశాలు, వనరులు కల్పిస్తూ వారి ఆర్థిక బలాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి వృద్ధ మహిళల వరకు అందరినీ మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. ఈ విధంగా మహిళలందరినీ ఒక వ్యవస్థలోకి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమన్నారు. అదేవిధంగా కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగ మహిళల కోసం ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

వీరి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి.. వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అయితే సోమవారం కూడా బీఆర్ఎస్ సభకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు హాజరుకావొద్దని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. సభలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వటంలేదని.. అందుకు నిరసనగా బీఆర్ఎస్ అసెంబ్లీని బహిష్కరించిన విషయం తెలిసిందే.

# పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

లేఖ రాశామని ప్రస్తావించారు. తమ అభిప్రాయాన్ని జీఆర్ఎంబీ కూడా సమర్థించిందని గుర్తుచేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. పోలవరం- నల్లమల్ల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టులో తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సూచించామని పేర్కొన్నారు. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసిందని తెలిపారు. రిట్ పిటిషన్‌లో కాదని.. సూట్ పిటిషన్‌లో రావాలని తమకు సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ కేసులో స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును వచ్చే సోమవారం కోరుతామని తెలిపారు. వచ్చే విచారణకు తాను కూడా ప్రత్యక్షంగా హాజరవుతానని స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మరోసారి న్యాయవాదులతో సమావేశం అవుతామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేశారని స్పష్టం చేశారు. గతంలో ఈ పథకం ఆగిపోయి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చెప్పలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ఒత్తిడి వల్లే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపేసిందని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణ- గోదావరి జలాల్లో తెలివి ఎక్కువ.. పని తక్కువ అని చెప్పుకొచ్చారు. అతి తెలివితో బీఆర్ఎస్ తెలంగాణకు భారీ నష్టం చేసిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అమెరికాలో తెలుగు యువతి దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

తన మాజీ ప్రియుడు అర్జున్ శర్మ నివాసంలోనే నిఖితా రావు గొడిశాల (27) అనుమానాస్పదంగా మృతిచెంది కనిపించింది. కత్తిపోట్లతో అతని అపార్ట్‌మెంట్‌లో విగతజీవిగా పడి ఉండగా పోలీసులు కనుగొన్నారు. అయితే అంతకుముందే అమె మాజీ బాయ్‌ఫ్రెండ్ దేశం విడిచి పారిపోయాడు. దానికంటే ముందు నిఖిత కనిపించడం లేదని అతనే పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.నిఖిత కనిపించడం లేదని జనవరి 2వ తేదీన అర్జున్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చివరిసారిగా తనను తన అపార్ట్‌మెంట్‌లో డిసెంబర్ 31వ తేదీన సాయంత్రం చూశాడనని వెల్లడించారు. ఈ మేరకు సెర్చ్ వారెంట్ జారీ చేసిన అధికారులు.. అర్జున్ ఉండే అపార్ట్‌మెంట్‌లో జనవరి 3వ తేదీన సోదాలు నిర్వహించారు. అప్పుడే కత్తిపోట్లతో నిఖిత మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం 7 గంటల తర్వాత నిఖితను అర్జున్ చంపేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో అర్జున్ కోసం ఆరా తీయగా.. జనవరి 2వ తేదీ సాయంత్రమే భారత్‌కు వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో అతడే నిఖితను హత్య చేసి దేశం విడిచి పారిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు.

అర్జున్ శర్మపై ఫస్ట్ డిగ్రీ, సెకండ్ డిగ్రీ మర్డ్ కేసుల కింద అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు హోవర్డ్ కౌంటీ పోలీసులు తెలిపారు. ఇండియాకు పారిపోయిన అర్జున్‌ను గుర్తించేందుకు ఫెడరల్‌లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సాయం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నిఖిత హత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని.. దర్యాప్తు కొనసాగుతున్నట్లు చెబుతున్నారు.

ఈ ఘటనపై భారత దౌత్య కార్యాలయం స్పందిం చింది. నిఖిత కుటుంబసభ్యులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నామని.. అవనసరమైన అన్ని దౌత్య సహాయాలను అందిస్తామని వెల్లడించింది. స్థానిక అధికారులతో కూడా నిరంతరం ఫాలో అప్‌లో ఉన్నట్లు తెలిపింది. కాగా, నిఖిత కుటుంబ మూలాలు సికింద్రాబాద్‌లో ఉన్నట్లుగా ఆమె సోషల్‌మీడియా ఖాతాల ఆధారంగా తెలుస్తోంది. కానీ ఆమె భారత్‌లో ఏప్రాంతానికి చెందిన యువతి అన్నది మాత్రం కచ్చితంగా అధికారులు ప్రకటించలేదు.

# బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు ప్రజలతో మమేకమవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌ను కార్యకర్తల ఆధారంగా బలమైన యూనిట్‌గా తీర్చిదిద్దుతూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీస్కుళ్లడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, అదే రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ప్రతి బూత్‌లో కార్యకర్తలకు ఆయా బూత్‌లలోని ఓటర్లపై పూర్తి అవగాహన ఉండాలి. గత ఎన్నికల్లో ఏ బూత్‌లలో తక్కువ ఓట్లు వచ్చాయో స్పష్టంగా ఐడెంటిఫై చేయాలి. కొన్ని బూత్‌లలో మొదటి స్థానం, మరికొన్నింటిలో రెండో స్థానం సాధించామని గుర్తుంచుకొని, బలహీనతలను బలంగా మార్చాలి.

ఉత్తరప్రదేశ్‌లో తొలిసారిగా పన్నా ప్రముఖ్ వ్యవస్థను విజయవంతంగా అమలు చేశారు. గుజరాత్‌లో కూడా అదే విధానం అనుసరించారు. ప్రతి 50 మంది ఓటర్లకు ఒక కార్యకర్త ఉండేలా పన్నా ప్రముఖ్ నిర్మాణం జరగాలి. ప్రతి బూత్‌ను మనమే సంరక్షంచుకోవాలి. బూత్ నిర్మాణ అభియాన్ అనేది పార్టీ భవిష్యత్తు ఎన్నికలకు పునాది. పార్టీలో బూత్ అధ్యక్షుడే అత్యంత కీలకమైన వ్యక్తి. బూత్ ప్రెసిడెంట్ పార్టీకి మూలస్తంభం. పునాది బలంగా ఉన్నప్పుడే పార్టీ బలంగా ఎదుగుతుంది.

బూత్ కమిటీల నిర్మాణమే అసలు లక్ష్యం. బూత్ కమిటీ, మండల కమిటీ, జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ, జాతీయ కమిటీ – ఇలా అన్ని స్థాయిల్లో కమిటీల నిర్మాణం పూర్తి స్థాయిలో జరగాలి. జిల్లాల వారీగా వర్క్‌షాప్‌లు నిర్వహించి, మండల స్థాయి వరకు సంస్థాగత నిర్మాణ పనిని విస్తరించాలి. బూత్ నిర్మాణం అనేది ఒక రోజు పని కాదు. ఇది నిరంతర బాధ్యత. ప్రతి కార్యకర్త దీనిని తన వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలి.

తెలంగాణలో పార్లమెంటు ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ ప్రభావం, ప్రజాభిమానం, వేవ్‌తో 8 సీట్లు గెలుచుకున్నాం. అదే వేవ్‌కు తోడు పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేస్తే, తెలంగాణలో సుమారు 16 పార్లమెంట్ సీట్లు గెలుచుకునే సామర్థ్యం బీజేపీకి ఉంది.

ఈ సమావేశంలో పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వేముల అశోక్, డాక్టర్ ఎన్. గౌతం రావు, తూళ్ల వీరేందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, భరత్, బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌ఛార్జి ఎన్.వి.సుభాష్, తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# వ్యక్తిగా వెళుతున్నా.. శక్తిగా తిరిగి వస్తా

(మొదటి పేజీ తరువాయి)

మండలి ఛైర్మన్‌కు కవిత విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 3న ఛైర్మన్ ఫార్మాట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. సోమవారం నాడు తెలంగాణ శాసనమండలి సమావేశాలకు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆమె.. ఇదే తన చివరి ప్రసంగం అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఇదే సమయంలో తన రాజకీయ భవిష్యత్‌పై, తాను ఎదుర్కొన్న పరిస్థితులపై, బీఆర్ఎస్ పార్టీపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ఊహించని రీతిలో విరుచుకు పడ్డారు కవిత. తన కింద నాయకులు చేస్తోన్న దురాగతాలను కేసీఆర్ గమనించడం లేదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చటాన్ని తాను అంగీకరించ లేదన్నారు. తెలంగాణలో ఏం సాధించిందని.. బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలకు వెళ్లిందంటూ తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. బీజేపీ తనను జైలుకు పంపితే.. బీఆర్ఎస్ నాయకులు తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరిగా మూడేళ్లు ఈడీతో తాను పోరాటం చేశానన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులు ఎందుకు మాట్లాడటం లేదంటూ కవిత సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్‌ను కాపాడుకోలేని పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత? అని అన్నారు. హరీష్ రావు అవినీతి పరుడంటూ కవిత ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగం పెద్ద జోక్ అని సెటైర్లు వేశారు. పార్టీ నడిపే పద్ధతి ఇది కాదని.. నైతికత లేని పార్టీ బీఆర్ఎస్ అంటూ శాసనమండలి సాక్షిగా దుమ్మెత్తిపోశారు. కనీసం సంజాయిషీ కూడా అడగకుండా తనను సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. 'నా ఇద్దరి కొడుకుల మీద ఒట్టు వేసి చెప్తోన్న.. బీఆర్ఎస్‌తో నాది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ' అని కవిత స్పష్టం చేశారు. 'ప్రశ్నిస్తే.. బీఆర్ఎస్ పార్టీలోని కొందరు నాపై కక్ష కట్టారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. పదవుల కోసం బీఆర్ఎస్ పార్టీలోకి పోలేదు. పార్టీలో.. ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నించాను. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. ఉద్యమకారులకు ఆర్థికసాయం చేద్దామంటే నా మాట వినలేదు. ఇసుక దందాల కోసమే నేరెళ్ళ దురాగతం జరిగింది. తెలంగాణ వచ్చాక కూడా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవటం అవమానకరం. సొంత సంస్థ జాగృతి ద్వారా తెలంగాణ ఉద్యమంలో పని చేసి గుర్తింపు సంపాదించుకున్నాను. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావాల్సిన పరిస్థితి ఉంది. ఉద్యమకారులు మాటలు కేసీఆర్‌కు చేరనివ్వటం లేదు. నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం బీఆర్ఎస్‌ను అడుక్కోలేదు.

ఉద్యమంలో పార్టీలకు అతీతంగా కష్టపడ్డాను. తెలంగాణ జాగృతి సంస్థతో రాజకీయాల్లోకి వచ్చాను. బతుకమ్మ పండుగను ముందుకు తీసుకెళ్ళాను.నీళ్ళ విషంలో గత పాలకులు చేస్తోన్న తప్పునే.. ప్రస్తుత పాలకులు చేస్తున్నారు.' అంటూ సంచలన కామెంట్స్ చేశారు కవిత. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవితఅన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్థూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను'అని కవిత అన్నారు. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు.

రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. 'ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా' అని కవిత వ్యాఖ్యానించారు.

# వరద జలాలను దోచుకున్న ఏపీ..!?

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ఏపీ తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ ప్రాజెక్టు ఇంకాప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డీపీఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటీ అనే ఆసక్తికరమైన ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వాడుకోవడమే తమ ఉద్దేశమని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు.

అయితే ఏపీ ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించుకోకూడదని సీజేఐ సూచించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటి? నా ఇల్లు - నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి? నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా.. ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు' అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ముకుల్ రోహత్గి వాదించారు. తెలంగాణ మాత్రం గోదావరిపై వందల ప్రాజెక్టుల నిర్మిస్తోందని ఏపీ తరఫున మరొక న్యాయవాది జగదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీజేఐ వెల్లడించారు.

# మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ!

(మొదటి పేజీ తరువాయి)

'మావోయిస్టు రహిత' రాష్ట్రంగా అవతరించేందుకు అడుగుదూరంలో నిలిచిందని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు మావోయిస్టు ఉద్యమాలకు కేంద్రబిందువుగా ఉన్న ఈ ప్రాంతంలో, ఇప్పుడు శాంతిభద్రతలు మెరుగుపడటం అభివృద్ధికి కొత్త బాటలు వేస్తోందని, తమ నిరంతర నిఘా, ప్రభుత్వ సంక్షమ పథకాలు, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలే ఇందుకు కారణమని అంటున్నారు.

తెలంగాణ రాష్ట్రం అతి త్వరలో మావోయిస్టు రహిత రాష్ట్రంగా తయారుకానుందని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 17 మంది మాత్రమే మిగిలివున్నారని, ఆ జాబితా తమ చేతిలో ఉందని చెబుతున్నారు. వీరిని తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**సెంట్రల్ కమిటీ**

ముప్పాల లక్ష్మణ్ రావ్ ఏగణపతి, తిప్పిరి తిరుపతి ఏదేవ్ జి, మల్లారాజి రెడ్డి @సంగ్రామ్, పసునూరి నరహరి@సంతోష్,

**స్టేట్ కమిటీ**

ముప్పిడి సాంబయ్య@సుదర్శన్, వార్త శేఖర్ @మంగుత్, జోడే రత్నా భాయ్, నక్కా సుశీల
లోకేటి చంద్ర శేఖర్, దామోదర్

**డివిజన్ కమిటీ**

రాజేశ్వరి, రంగబోయిన భాగ్య, బాడిషా ఉంగా, సంగీత, భవాణి, మైసయ్య, భగత్ సింగ్

# ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

చేయించారంటూ మాజీ మంత్రి హరీష్ రావుపై రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయ్యింది. దీన్ని సవాల్ చేస్తూ హరీష్ రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. సరైన ఆధారాలు లేనందున ఈ కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం సుప్రీంలో విచారణ జరుగగా.. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం తేల్చిచెప్పింది. ఎస్ఎల్పీలో జోక్యం చేసుకునేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గతంలో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసినట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు, రాధాకిషన్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు అదే ఏడాది డిసెంబర్ 4న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ గత ఏడాది మార్చి 20వ తేదీన ఆదేశాలిచ్చింది. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జూన్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆ పిటిషన్లను కొట్టివేసింది.

# దేవుడిని వదలకపోవడం దారుణం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రో ప్లేటింగ్ కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని కేరళ హైకోర్టుకు సిట్ వెల్లడించింది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 42.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిపై ఉండే బంగారంలో కొంత అదృశ్యమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి దానిని ప్రైవేటుగా మళ్లించాడని ఆరోపించింది. ఎలక్ట్రోప్లేటింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్‌కు ఇప్పటికే బంగారం అప్పగించాడు. ఈ కేసు విచారణలో భాగంగా గతంలో బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్‌పై కేరళ హైకోర్టు తీవ్రవ్యాఖ్యలు చేసింది. నేరపూరిత కుట్ర ఆరోపణల నుంచి తప్పించుకోలేరని మండిపడింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో తనకు వ్యతిరేకంగా ఉన్న తీవ్ర వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ తాజాగా అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

ఇక ఈ కేసులో దర్యాప్తు పూర్తిచేయడానికి సిట్‌కు కేరళ హైకోర్టు మరో ఆరువారాల గడువు ఇచ్చింది. జనవరి 19న ప్రత్యేక దర్యాప్తు బృందం మధ్యంతర నివేదికను న్యాయస్థానానికి సమర్పించనుంది.

# సభను తప్పుదోవ పట్టించిన సీఎం

## స్పీకర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

హైదరాబాద్,జనవరి5(వార్త వేదిక సూర్య): సీఎం రేవంత్‌రెడ్డిపై భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. నదీ జలాలపై చర్చ సమయంలో సభను తప్పుదోవ పట్టించారని పేర్కొంటూ సభాహక్కుల ఉల్లంఘన కింద ఫిర్యాదు చేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినిట్స్, రాయలసీమ ఎత్తిపోతల పనుల నిలిపివేత, కృష్ణా జలాల్లో తాత్కాలిక ఒప్పందంపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పీకర్ సూచన మేరకు ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు అందజేశారు.

# కనికరం లేని కన్న కొడుకులు - అనాధ అయిన మాతృమూర్తి

## నా ఆస్తి కావాలి కానీ నాకు నాలుగు మెతుకులు పెట్టడం లేదు : న్యాయం చేయండి సారు అని కలెక్టర్‌ను వేడుకున్న ఓ తల్లి

**యాదాద్రి భువనగిరి, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** కూటికి దూరమై,కాటికి దగ్గరౌతున్న పండుటాకులైన వయోవృద్ధులకు న్యాయం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు రావును సీనియర్ సిటిజన్స్ చేతులెత్తి వేడుకుంటున్నారు. సోమవారం రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన మల్లెబోయిన మీనమ్మ, నడవలేని స్థితిలో కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ సార్ ను న్యాయం చేయాలని వేడుకుంది.

మీనమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరినీ పెంచి పెద్ద చేసింది. తన భర్త మల్లె బోయిన లచ్చయ్య మరణం తరువాత కష్టాలు ప్రారంభం అయ్యాయి. తాను, తన భర్త కష్టపడి సంపాదించిన భూమిని సర్వే నంబర్ 331 లోని భూమిని తన కుమారులిద్దరూ సమంగా పంచుకొని, వారి భార్యల పేర్ల మీదకు మార్చుకున్నారు. మీనమ్మ తల్లిదండ్రులు పసుపు కుంకుమ కింద ఇచ్చిన భూమి సర్వ నెంబర్ 251 లోని భూమిని, తనకు బ్యాంక్ లోన్ ఇప్పిస్తామని చెప్పి సంతకం చేయించుకొని వేరే వారికి అమ్ముకున్నారు. దీంతో భూమిని కోల్పోయిన మీనమ్మ ను నిర్లక్ష్యం చేయడంతో చిన్న కూతురు కత్తుల యాక లక్ష్మ వద్దనే గత కొన్ని సంవత్సరాలుగా ఉంటుంది. ఇటీవల మీనమ్మ ఆరోగ్య పరిస్థితి బాగ లేకపోవడంతో పెద్ద మనుషులు కొడుకులను పిలిపించి అడగ్గా, మా





అమ్మతో సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో మీనమ్మ గత నెల ఆరున యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ను కలువగా చౌటుప్పల్ ఆర్డీవో దగ్గరకు పంపించాడని మీనమ్మ చెబుతుంది. ఆర్డీఓ విచారణా చేసి మీనమ్మ పోషణకు, వైద్య ఖర్చుల నిమిత్తం వయోవృద్ధులు సంరక్షణ చట్టం -2007 ప్రకారం కొడుకులు మీనమ్మకు పోషణకు వైద్య ఖర్చులకు గానూ కొంత నగదును ఇవ్వాలని ఆదేశించారు. కానీ కొడుకులిద్దరూ ఆర్డీవో ఆదేశాలు బేఖాతరు చేసారు. దీంతో ఆర్డీవో రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేయాలని లేఖ రాశారు. మీనమ్మ రామన్నపేట పోలీసులను కలువగా, వారు కేసు నమోదు చేయడం లేదని, జిల్లా కలెక్టర్‌ను కలవాలని చెప్పడంతో సోమవారం ప్రజావాణి లో కలెక్టర్‌కు వచ్చిన మీనమ్మ తన గోడును కలెక్టర్ కు చెప్పుకొని విలపించింది.

తనకు ఆరోగ్యం సహకరించడం లేదని, ఎడమ కాలు వేలుని తీసి వేయాలని డాక్టర్లు చెప్పారని, తన పోషణకు వైద్య ఖర్చులకు చాలా ఇబ్బందిగా ఉందని తనకు న్యాయం చేయాలని కలెక్టర్ ను వేడుకుంది. తన కుమారులైన మల్లె బోయిన లింగయ్య, కోడలు మల్లె బోయిన ముత్తమ్మ, మనుమలు మల్లె బోయిన లక్ష్మణ్, మల్లె బోయిన హేమేంద్ర, మల్లె బోయిన గణేష్ లపై చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్ ను కోరారు.






## పనకబండలో పారిశుద్ధ్య వారోత్సవాలు

**మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** మండలంలోని పనకబండ గ్రామంలో సోమవారం నాడు పారిశుద్ధ్య వారోత్సవాలు జరిగాయి... గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొని అన్ని వార్డులను ప్రమాదానం చేశారు. వీధులలో చెత్తను మురుగు కాల్వలను శుభ్రం చేసి, పరిశుభ్రతపై స్థానిక సర్పంచ్ లోతుకుంట రేణుక-అనిల్ అవగాహన కల్పించారు. ఈనెల 7 వరకు జరిగే ఈ వారోత్సవాలను ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని రేణుక పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాధారపు మల్లేశం, మాజీ సర్పంచ్ బత్తిని తిరుమల్లేశ్, వార్డు సభ్యులు పైళ్ల మహాలక్ష్మ బిసతీష్ గ్రామస్తులు నల్లపోగుల వెంకన్న, బత్తిని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూరు అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**- మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ యాకుబ్ రెడ్డి**

**మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ 35 కోట్లతో అభివృద్ధి జరిగిందని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం ప్రెస్ మీట్‌లో పేర్కొన్నారని... ఇది నిజమైతే ఈ 35 కోట్ల అభివృద్ధిపై శ్వేతపత్రం ఎమ్మెల్యే విడుదల చేయాలని మోత్కూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి సోమవారం నాడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం హాయంలో 20 కోట్ల రూపాయలు మంజూరయ్యారని ఆ నిధులతోనే నేడు అభివృద్ధి పనులు సాగుతున్నాయని అన్నారు. నాడు తుంగతుర్తి ఎమ్మెల్యేగా పనిచేసిన గాదరి కిషోర్, అప్పటి మున్సిపల్ చైర్మన్ సావిత్రి మేఘారెడ్డి హాయంలో మంజూరైన మెయిన్ రోడ్డు బి.టిని సి సి. రోడ్డు కూడా వారు ప్రతిపాదించిన నిధులతోనే నేడు సీసీ రోడ్డు పనులు జరిగాయని పేర్కొన్నారు.

## 13,14,15 తేదీలలో పెద్దమ్మతల్లి 18వ వార్షికోత్సవం

**మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** స్థానిక పెద్దమ్మతల్లి దేవాలయంలో ఈనెల 13,14, 15 తేదీలలో అమ్మ వారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ దేవాలయ కమిటీ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపింది. 13 ఉదయం గణపతి పూజ, అభిషేకం, హెూమం, 14న




భోగి పర్వదినం పురస్కరించుకొని సాయంత్రం 5గంటలకు పెద్దమ్మ, గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించుట, 15న ముదిరాజ్ లు వనభోజనాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 13 నుంచి జరిగే పెద్దమ్మ తల్లి వార్షికోత్సవాన్ని ప్రజలు, పెద్దమ్మతల్లి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయం చేయాలని కోరారు.

## శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు...

**మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం, మండలంలోని పనకబండ గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలదారులు ఇరుముడులు కట్టుకొని సోమవారం నాడు శబరికి బయలుదేరి వెళ్లారు. అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించి పడిపై కర్పూరం వెలిగించారు. ఇరుముడులు కట్టుకొని శబరికి బయలుదేరి వెళ్లారు. పూజ కార్యక్రమాలు




గురుస్వామి మోత్కూర్ ప్రదీప్ శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు మొగుళ్ల శ్రీనివాస్ రెడ్డి, సంజీవ రెడ్డి, యాదిరెడ్డి, సూదగాని పాండు, రాధారపు మల్లేశం ఆరాని శేఖర్, చింతల సందీప్ రెడ్డి, రమేష్,రాజిరెడ్డి, మహేందర్, మధు, బాలయ్య, మహేష్ అయ్యప్ప మాలదారులు భక్తులు పాల్గొన్నారు.

## గొర్రెలకు నట్టల నివారణకు మందుల పంపిణి

**మోటకొండూరు,జనవరి 05 (వార్త వేదిక సూర్య):** మోటకొండూర్:మోటకొండూర్ మండలంలోని తెర్యాలలో సర్పంచ్ మంత్రి లత స్వామి ఆధ్వర్యంలో 1850 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణి చేశారు.ఈ కార్యక్రమం లో గోల్లకుర్మ



సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీకాంత్, పశు వైద్యులు మహేందర్, అనిత రైతులు బొంగు సిద్దిరాములు బొంగు శంకరయ్య మెడీ రాములు, కోర రవి బండ పాండు బొంగు నరేష్ తదితరులు పాల్గొన్నారు

## యాదాద్రి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ కాసం నాగేష్‌కి ఆత్మీయ ఘన సన్మాన కార్యక్రమం...

**ప్రజా సేవలో ఆదర్శంగా నిలుస్తున్న ఉపసర్పంచ్ కాసం నాగేష్‌కి ఘన సత్కారం.**

**గుండాల, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి జిల్లా ఆర్యవైశ్య సంఘము తరపున గెలుపొందిన సుద్దాల గ్రామ ఉప సర్పంచ్ కాసం నాగేష్ గారికి ఘనమైన సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. సోమవారం గుండాల మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహ భరితంగా సాగింది. గుండాల మండలానికి చెందిన ఆర్య వైశ్య సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై, ఇటీవల ఉపసర్పంచిగా ఎన్నికైన కాసం నాగేష్ గుప్తాను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవలో కాసం నాగేష్ గారు చూపుతున్న నిబద్ధత, నిజాయితీ, సేవాభావం ప్రశంసనీయం అని పేర్కొన్నారు.

గ్రామ ప్రజల సమస్యలను సమర్థంగా పరిష్కరించడంలో ఆయన ముందుండి పనిచేస్తారని, అభివృద్ధి కార్యక్రమాలకు మరింత వేగం తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా చేరేలా కృషి చేస్తారని తెలిపారు.సన్మానానికి స్పందించిన



కాసం నాగేష్ గారు మాట్లాడుతూ,తనపై సుద్దాల గ్రామ ప్రజలు నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం సౌహార్ద పూర్వక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సామి శెట్టి శ్రీనివాస్, నరసయ్య సార్, వెంకన్న, కొత్త రమేష్, బజ్జూరి కిరణ్, కోటి, కాసం లక్ష్మనారాయణ, కాసం సత్తయ్య, నాగ బండి సత్తయ్య, సంతోష్, సోమయ్య, రాములు, నాగరాజు, సత్తయ్య, తదితర గుండాల మండల ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు.

## అశాస్త్రీయంగా వార్డుల విభజన..


**సతమతమౌవుతున్న ఆయా వార్డు ప్రజలు**

**మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు పట్టణంలోని ఉన్నట్టువంటి 12 వార్డులలో గతంలో మోత్కూరు గ్రామ పంచాయతీ ఉన్న సమయంలో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం నుండి బృందావన్ కాల్వ వరకు ఒకటో వార్డుగా ఉండగా 2020 మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వార్డు విభజనలో భాగంగా అవార్డును రెండో వార్డుగా బృందావనం కాల్వనుంచి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఉన్నట్టువంటి రెండో వార్డును ఒకటో వార్డుగా అప్పటి అధికారులు తప్పిదాలు చేశారు. ఈ విషయాన్ని అప్పట్లోనే ఆయా వార్డు ప్రజలు ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేస్తూనే మున్సిపల్ అధికారుల నుండి జిల్లా ఉన్నతాధికారుల వరకు దశలవారీగా ఆందోళన వినతులు ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభంమౌతున్న నేపథ్యంలో గతంలో ఉన్నట్టువంటి శ్రీ రామలింగశ్వర స్వామి ఆలయం నుండి ఒకటో




వార్డును యధావిధిగా కొనసాగించాలని, బృందావన్ కాల్వ నుంచి ఉన్నట్టువంటి రెండో వార్డును యధావిధిగా రెండో వార్డు మాదిరిగానే కొనసాగించాలని ఆయా వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వార్డుల విభజన సక్రమంగా లేకపోవడం వల్ల ఆధార్ కార్డులో రెండో వార్డుగా నమోదై ఉన్న ఆయా వార్డు ప్రజలు మున్సిపల్ వార్డులో విభజన వచ్చేసరికి ఒకటో వార్డుగా నమోదు కావడంతో రాబోయే చిన్న, చితక ఉద్యోగాలు పొందాలంటే ఈ వార్డు ప్రజలతోనే ముడిపడి ఉందని అక్కడి ప్రజలు అంటున్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇప్పటికైనా అధికారులు గతంలో గ్రామపంచాయతీలో ఉన్నట్టువంటి వార్డులను యధావిధిగా కొనసాగించాలని కోరుతున్నారు.

అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామంలో ఉన్న మూడో వార్డు కొంత భాగం కొండగడప మరికొంత భాగం కాశావారి గూడెం ఓటర్లను నమోదు చేశారని ఇదెక్కడి పద్ధతిని అని అక్కడి ప్రజలు,ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. దీనితోడు పదో వార్డు కొంత భాగం అన్నెపువాడ,మరికొంత ధర్మాపురం, బుజిలాపురం గ్రామాలతోపాటు యాదవ కాలనీ, కాశవారి గూడెం ఉందని అక్కడ నుంచి పోటీ చేసే అభ్యర్థులు వాపోతున్నారు గందరగోళంగా ఉన్న మున్సిపల్ వార్డులలో భాగంగా ఈ వార్డులను ఆయాప్రాంతాల నుంచి ప్రజలకు అనుకూలంగా ఉన్న వార్డులలో సరిచేయాలని పలువురు కోరుతున్నారు.



## ఇంటర్మీడియట్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

**- కలెక్టర్ ఎం హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి బ్యూరో, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కళాశాల ప్రిన్సిపల్స్ కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం రోజు మినీ మీటింగ్ హాల్లో జిల్లా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పై సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లడుతూ ప్రభుత్వము విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తునందున అదే దిశగా ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలలో కనీస సౌకర్యాలు లైటింగ్,బెంచీలు,ఫ్యాన్లు, మంచినీటి, తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం ల్యాబ్ మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాస్ లు ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చూడాలన్నారు. పిల్లలకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉండేలా కళాశాల ప్రిన్సిపల్స్ కృషి చేయాలని అన్నారు. కళాశాలలో ఏమైనా సమస్యలు, మరమ్మత్తులు ఉంటే 20 రోజుల్లో పూర్తిచేయాలని ఆర్ అండ్ బి ఇంజనీర్లను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని రమణి, కళాశాల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటర్ల జాబితాపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం

**మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** మున్సిపల్ 2వ, సాధారణ ఎన్నికలు 2026 ముసాయిదా ఓటర్ల జాబితా అభ్యంతరాల స్వీకరణపై సోమవారం నాడు స్థానిక




మున్సిపల్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం అనుసరించి 01బి01--2026 నాడు విడుదల చేసిన ముసాయిదా ను మున్సిపల్ ఉన్న 12 వార్డులను వార్డుల వారీగా ప్రచురించి ప్రజల నుంచి అభ్యంతరాలను తీసుకున్నామని తెలిపారు.

అనంతరం అన్ని రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ వార్డులను ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల ఓట్లు వేర్వేరు వార్డులలో ఉండటంపై మున్సిపల్ కమీషనర్ దృష్టికి తీసుకొచ్చారని, అవసరమైతే వార్డులను డీలిమిటేషన్ చేసి దగ్గర ఉన్న ప్రాంతాలను ఒకే వార్డులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు కమీషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై కొంపల్లి సతీష్, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్ రెడ్డి, అన్ని రాజకీయపార్టీల నాయకులు , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాంతినగర్ ఆలయంలో ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజ

**- పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 05 (వార్త వేదిక సూర్య): రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శాంతినగర్ దేవాలయంలో సోమవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి పూజా కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. 41 రోజుల పాటు కఠిన దీక్షను విజయవంతంగా పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వాములు శబరిమల యాత్రకు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ మరియు డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడి కట్టుకున్న డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్ మరియు ఇతర మాలధారులను శాలువాతో ఘనంగా సత్కరించారు. స్వామియే శరణం అయ్యప్ప అనే నామస్మరణల మధ్య శబరిమల బయలుదేరుతున్న స్వాములకు ఆయన వీడ్కోలు పలికారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ..

అయ్యప్ప దీక్ష క్రమశిక్షణకు, భక్తికి నిదర్శనమని, స్వామివారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రవీందర్ స్వామి, బల్ల శ్రీధర్ స్వామి, చందు స్వామి, సన్నిధానం స్వాములు మరియు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా

# రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా సదస్సు

నల్లగొండ,జనవరి 05 (వార్త వేదిక సూర్య):

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ గారి సూచనల మేరకు, నల్గొండ పట్టణంలోని పోపాల్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ రమేష్ హాజరై మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చిన్న వయసు నుంచే ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకుని, వాటిని కట్టుబాటుగా పాటిస్తే భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగించాలి, వాహనాలు నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రాణాపాయాలు, అధిక వేగం వల్ల జరిగే ప్రమాదాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రోడ్డుపై ఉన్న సూచిక







బోర్డుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.జీబ్రా క్రాసింగ్ వినియోగం, రోడ్డును దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాదచారుల భద్రత వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అనే నినాదాన్ని విద్యార్థులు తమ దైనందిన జీవితంలో అమలు చేయాలని, తమ కుటుంబ సభ్యులు మరియు మిత్రులకు కూడా రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ సైదులు, డిటీఆర్బి రిటైర్ సిఐ అంజయ్య, పాఠశాల ప్రిన్సిపాల్,రవి, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.









# 12వ బెటాలియన్ అన్నేపర్తిలో ఘనంగా ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్-2026

నల్లగొండ,జనవరి 05 (వార్త వేదిక సూర్య):

12వ బెటాలియన్ అన్నేపర్తిలో సోమవారం ఘనంగా ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ఉ2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమాండెంట్_. వీరయ్య హాజరై క్రీడా వేడుకలను ప్రారంభించారు.కార్యక్రమంలో వివిధ కంపెనీలకు చెందిన పోలీస్ సిబ్బంది కంటింజెంట్లు కవాతు నిర్వహించగా, 12వ బెటాలియన్ పైప్ బ్యాండ్ ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా కమాండెంట్ _. వీరయ్య మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది ఉద్యోగ పరంగా ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించడంలో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ ఆటల ద్వారా సిబ్బందిలో ఉత్సాహం, స్ఫూర్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది నిర్వహించిన కవాతు తనను ఎంతగానో ఆకర్షించిందని తెలిపారు.తెలంగాణ స్పెషల్ పోలీస్ అడిషనల్ డీజీ శ్రీ సంజయ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు ఈ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించినట్లు కమాం డెంట్ వెల్లడించారు. పోలీస్ సిబ్బంది క్రీడా స్ఫూర్తితో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పోలీస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సిహెచ్. ఆంజనేయ రెడ్డి, నర్సింగ్ వెంకన్న, ఏవో అతీక్ ఉర్ రహమాన్, యూనిట్ హాస్పిటల్ షర్మిలా దేవి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.







## మహేశ్వరం గ్రామాన్ని

# ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతా..

**మహేశ్వరం గ్రామంలో పాలక వర్గంతో కలిసి పర్యటించిన సర్పంచ్ మునగపాటి నవీన్**

మహేశ్వరం, జనవరి 05 (వార్త వేదిక సూర్య):

మహేశ్వరంలో గ్రామంలో నీళ్లు, విద్యుత్తు, పారిశుద్ధ్య, రోడ్ల సమస్యలను తెలుసుకోవడాని 1,2,3 వార్డులలో అధికారులు, వార్డు సభ్యులు సిబ్బందితో కలిసి పర్యటించి వివరాలు సేకరించిన మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్. మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు తెలుసుకోవడానికి వార్డుల్లో పర్యటిస్తున్నానని. వేసవికాలం రాబోతుంది కాబట్టి మంచినీటి సమస్యలు లేకుండా చేయడానికి కృషి చేస్తున్నానని అలాగే విద్యుత్తు వీధి దీపాలు రోడ్లు అలాగే పారిశుధ్యం పై దృష్టి పెట్టానని అతి త్వరలో వీటన్నింటిని పరిష్కరించి మహేశ్వరం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే నా ఆశ ఆశయం అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో,మహేశ్వరం గ్రామ ఉప సర్పంచ్ జొరల రమేష్ వార్డు సభ్యులు టీంగిరికారి బేబీ, పోల్కం సునీత, అవులకాడి కిష్టమ్మ,స్వర్ణగంటి సంజీవ, ఎస్. ఆజం, కాడమోని స్వాతి , వత్తుల షాలిని, దిద్దేల శ్రీశైలం, కాకి పరమేష్,ఆకుల వీరబాబు, సున్నం స్వప్న , జాటవత్ రుకేశ్, రెవెళ్ల చెంద్రమౌళి మాజీ వార్డు సభ్యులు ఒగ్గు లింగం.గ్రామ పెద్దలు, సున్నం కృష్ణ, ప్రభాకర్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిఐ రాష్ట్ర కన్వీనర్ అధికార ప్రతినిధిగా కణం గణేష్ గౌడ్

**శుభాకాంక్షలు తెలిపిన మహేశ్వరం మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం ఆంజనేయులు**

మహేశ్వరం, జనవరి 05 (వార్త వేదిక సూర్య): టిపిసిసి లీగల్ ఆర్‌టిఐ రాష్ట్ర కన్వీనర్ అధికార ప్రతినిధిగా కణం గణేష్ గౌడ్ నియామకం పట్ల మహేశ్వరం మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం ఆంజనేయులు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్ టి ఐ రాష్ట్ర కన్వీనర్ అధికార ప్రతినిధిగా కణం గణేష్ గౌడ్ ఎన్నిక కావడం పట్ల ఆనందం సంతోషం వ్యక్తం చేస్తూ అందరూ ఆదరించే విధంగా పని చేయాలని అందరినీ కలుపుకొని పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని మాదారం ఆంజనేయులు ఆకాంక్షంచారు. ఆర్ టి ఐ రాష్ట్ర కన్వీనర్ అధికార ప్రతినిధిగా ఎన్నిక కావడం గొప్ప విషయం అని కష్టపడి పని చేస్తే గుర్తింపు వస్తుందని తెలియడానికి కణం గణేష్ గౌడ్ కారణం అని అన్నారు.కణం గణేష్ గౌడ్‌కు మాదారం ఆంజనేయులు శుభాకాంక్షలు తెలిపారు.










## 12న మోత్కూరులో మెగా రక్తదాన శిబిరం

మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):

జాతీయ యువజన దినోత్సవం , స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈనెల 12న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోత్కూరు శాఖ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మ నర్సింహ్మ హాస్పిటల్ నిర్వహిస్తున్నట్లు ఆ సొసైటీ జిల్లా అధ్యక్షులు గుర్రం లక్ష్మ నర్సింహ్మ రెడ్డి సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

## శాసనమండలిలో చేనేత సమస్యలపై ప్రస్తావించడం పట్ల ఎమ్మెల్సీ సత్యం హర్షం

మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):



చేనేత రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శాసనమండలిలో సోమవారం ప్రస్తావించడం పట్ల తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మ నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నాడు లక్ష్మ నర్సయ్య మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసి వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, చేనేత సహకార సంఘాల అప్పులను సైతం మాఫీ చేయాలని, సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం 2018 తో పూర్తి చేశారని... వెంటనే ఈ చేనేత ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారన్నారు. టెస్కో సంస్థను ప్రభుత్వమే నిర్వహించాలని, చేనేత మగ్గాలపై నేసిన వస్త్రాలను కొనుగోలు చేసిన వినియోగదారులకు 30% డిస్కౌంట్ ఇవ్వాలని, నేతన్నకు భరోసా పథకంలో మగ్గం వేసే కార్మికుడికి ఏడాదికి రూ 18,000, అనుబంధ కార్మికుడికి రూ. 6000 చొప్పున మంజూరు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని శాసనమండలిలో కోరాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పక్షన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కు ఇటీవల వినతి పత్రాన్ని సమర్పించామని ఆయన తెలిపారు. తాము వినతిపై చేసిన విజ్ఞప్తి ప్రకారం ఎమ్మెల్సీ సత్యం శాసనమండలిలో చేనేత సమస్యలను ప్రభుత్వానికి వివరించారని, ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించినందుకు ఎమ్మెల్సీ సత్యం కు, ప్రభుత్వానికి లక్ష్మనర్సయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# మోత్కూరు-రాజన్న గూడెం రోడ్డు పనులను వెంటనే చేపట్టాలి

**మోత్కూరు - భువనగిరి రహదారిపై బి.ఆర్.ఎస్.నాయకుడు నిరసన**

మోత్కూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):

మోత్కూరుబిరాజన్నగూడెం రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బి.ఆర్.ఎస్.జిల్లా నాయకుడు బందెల శ్రీను సోమవారం నాడు మోత్కూరుబి భువనగిరి రహదారిపై ప్లే కార్డు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ స్థానిక బిఎస్ఎన్ఎల్ టవర్ నుంచి రాజన్న గూడెం వరకు గత





ప్రభుత్వ హాయంలోనే నిధులు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు దాటుతున్న నేటికీ ఈ రోడ్డు పనులు చేయకపోవడం వల్ల తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులు దుమ్ము , దూళితో త్రీవ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిదులు వెంటనే స్పందించి ఈ రోడ్డు పనులను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

## తోకల శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ శ్రేణులు

మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 05 (వార్త వేదిక సూర్య): రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని డివిజన్‌కు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, యువకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్తులో కూడా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బబ్లూ, ఎల్.వి. రెడ్డి, అడికే శివ, రాజవర్ధన్ రెడ్డి, పృధ్వీ రాజ్, ఎన్. శంకర్ రెడ్డి, బొల్లా రామకృష్ణ, అమరేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.








## ముఖ్యమంత్రి సహాయనిధుల చెక్కులు పంపిణీ చేసిన
# ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, జనవరి 05 (వార్త వేదిక సూర్య):**
నిరుపేదలకు వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తామని మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సోమవారం సీతాఫల్మండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన 20 మంది లబ్ధిదారులకు రూ:9 లక్షల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా నియోజకవర్గానికి చెందిన ప్రజల సమస్యల పరిష్కారానికి తమ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ శ్రీకాంత్, డాక్టర్ హేమ సామల, రాసురి సునిత మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బిఆర్ఎస్ నాయకులు రాజేష్, పాకసాయి తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో ప్రజా సమస్యలపై
## హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్ జీఎంను కలిసిన మహేష్ గౌడ్

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 05 (వార్త వేదిక సూర్య):**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ప్రధాన నిర్వాహకురాలు (జనరల్ మేనేజర్) లక్ష్మని సాయి లక్ష్మ ని ఎన్ఎస్‌యూఐ రాజేంద్రనగర్ నాయకుడు బి. మహేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా




కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆదర్శ కాలనీలో తీవ్రంగా ఉన్న డ్రైనేజ్ సమస్యలు మరియు తాగునీటి పైపుల లీకేజీ సమస్యల వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మహేష్‌గౌడ్ ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన ప్రధాన నిర్వాహకురాలు లక్ష్మని సాయి లక్ష్మ సమస్యలపై సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపి
# పట్టుబడితే జైలు శిక్ష తప్పదు

**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష**

**ట్రాఫిక్ సీఐ మహా లక్ష్మయ్య**

**నల్లగొండ, జనవరి 05 (వార్త వేదిక సూర్య):**
మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుపడితే జరిమానా తో పాటు జైలు శిక్ష తప్పదని నల్గొండ ట్రాఫిక్ సీఐ అన్నారు. నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ శరచ్చంద్ర పవార్ ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 30 మంది వాహనదారులు పట్టుబడ్డారని ట్రాఫిక్ సీఐ





తెలిపారు. ఈ సందర్భంగా పట్టుబడిన వారిని ఈరోజు కోర్టులో హాజరుపరచగా, కేసులను విచారించిన నల్గొండ ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తూ, వారిలో ఇద్దరికి (2) రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000/- జరిమానా,మిగిలిన 28 మందికి కలిపి మొత్తం రూ.25,000/- జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ,మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కేవలం తాము మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీలు ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదని, ప్రజల ప్రాణాలు కాపాడడానికే అని స్పష్టం చేశారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి, మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఇలాంటి తనిఖీలు నిరంతరం కఠినంగా కొనసాగుతాయని ట్రాఫిక్ సీఐ మహా లక్ష్మయ్య తెలిపారు.

# దారుణం: చెత్తకుప్పలో నవజాత శిశువు మృతదేహం

## మైలార్‌దేవ్‌పల్లిలో కలకలం రేపిన ఘటన

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 05 (వార్త వేదిక సూర్య):**
సమాజంలో మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. నవ మాసాలు మోసి కన్న బిడ్డను గుండెలకు హత్తుకోవాల్సిన వారే.. ప్రాణం లేని ఆ పసికందును చెత్తకుప్ప పాలు చేసిన ఘటన రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్‌లో ఆదివారం కలకలం రేగింది. ఇక్కడి రోడ్డు పక్కన ఉన్న ఒక చెత్తకుప్ప వద్ద నెలలు నిండని నవజాత శిశువు (ఆడబిడ్డ) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆ పసికందును అక్కడ పారవేసి వెళ్లారు. శిశువు అప్పటికే మృతి చెంది ఉండటంతో స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.స్థానికులు వెంటనే 100కు కాల్ చేసి సమాచారం అందించడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఆసుపత్రికి తరలించారు. ఈ





అమానుషానికి ఒడిగట్టిన వారు ఎవరనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని, పరిసర ప్రాంతాల్లోని సిసిటివి (సీసీటీవీ) _మెరాలను పరిశీలిస్తున్నారు.





# శంషాబాద్‌లో ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలు

## యువ పురస్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 05 (వార్త వేదిక సూర్య):**
రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్ పట్టణం లోని ఎస్.ఎస్.ఆర్ గార్డెన్ కన్వెన్షన్ హాల్‌లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తెలంగాణ 44వ రాష్ట్ర మహాసభలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ మహాసభల మూడవ రోజు భాగంగా నిర్వహించిన జనమంచి గౌరీ శంకర్ యువ పురస్కార్ కార్యక్రమానికి కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం జనమంచి గౌరీ శంకర్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత భీమనపల్లి శ్రీకాంత్ గారికి జ్ఞాపికతో పాటు రూ.50,000 నగదు బహుమతిని బండి సంజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, దేశం కోసం, ధర్మం కోసం ప్రాణత్యాగాలకు కూడా వెనుకాడని, నిరంతరం శ్రమిస్తూ పోరాడే కార్యకర్తలు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తలని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దు కోసం ఏబీవీపీ అనేక ఉద్యమాలు, కార్యక్రమాలు నిర్వహించిందని, దేశ సమగ్రత కోసం కీలక పాత్ర పోషించిందని తెలిపారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో దేశాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తూ, సేవాభావాన్ని ఇప్పటినుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు.తదనంతరం జరిగిన సమావేశంలో బండి సంజయ్ కుమార్ మరియు తోకల శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఏబీవీపీ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నిక చేయడం జరిగింది. ఎన్నికైన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై, విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలపై అలుపెరుగని పోరాటం చేయాలని, విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం మరియు శంషాబాద్ పరిధిలోని బీజేపీ ముఖ్య నాయకులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్యకర్తలు, అఖిల భారతీయ సంఘటన మంత్రి బాలకృష్ణ జీ, దక్షణ క్షత్ర సంఘటన కార్యదర్శి చెరుకే శివకుమార్ జీ, ప్రాంత ప్రముఖ్ మాసాడి బాబురావు, ప్రాంత సంఘటన విష్ణువర్ధన్ జీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రావుల కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, గ్రేటర్ హైదరాబాద్ ప్రముఖ్ రామకృష్ణ, హైదరాబాద్ సంఘటన మంత్రి రాజశేఖర్ జీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందాడి శ్రీరామ్, శంషాబాద్ విభాగ్ సంఘటన మంత్రి మల్లికార్జున్ జీ, శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్, జిల్లా కన్వీనర్ పవన్, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# చిన్న అనంతగిరి శివాలయంలో ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

**మూడు రోజుల పాటు వైభవంగా వేడుకలు**

**శ్రీ ప్రణవ భక్త సమాజం**

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 05 (వార్త వేదిక సూర్య):**
చిన్న అనంతగిరి శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ ప్రణవ భక్త సమాజం (హైదర్‌గూడ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాల సన్నాహక సమావేశం సోమవారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సమావేశానికి సమాజ అధ్యక్షులు మోంద్ర నర్సింహా అధ్యక్షత వహించారు. ఫిబ్రవరి 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ మహాశివరాత్రి మహెూత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఫిబ్రవరి 14 (శనివారం): ఉదయం 4:00 గంటలకు గణపతి అభిషేకం, గణపతి హెూమం మరియు యజ్ఞంతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఫిబ్రవరి 15 (ఆదివారం): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రోజంతా శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించబడతాయి. ఫిబ్రవరి 16 (సోమవారం): ఆలయానికి విశేష పుష్పాలంకరణ చేయడంతో పాటు, సాయంత్రం వేళలో భారీ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ మూడు రోజుల పాటు ఆలయంలో నిరంతర భజనలు, శివనామ స్మరణ మరియు జాగరణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఈ సన్నాహక సమావేశంలో సమాజ ఉపాధ్యక్షులు సనివేల్లి కృష్ణ, బర్ల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, కోశాధికారి ఎస్.బి. హరినాథ్, కార్యదర్శి కొండమీది హరినాథ్, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి, మ్యాడం రామేశ్వర్ రావు, మోంద్ర కొమురయ్య, సీనియర్ జర్నలిస్ట్ మ్యాడం మధుసూదన్, గుమ్మకొండ పెంటారెడ్డి, సనివేల్లి జయానంద్ రెడ్డి, సాబాధ విజయ్ కుమార్, మోంద్ర అయిలయ్య, పెంటల సుధాకర్ రెడ్డి, కాకులారం కృష్ణ, కుక్కునూరి కిరణ్ చారి, చెట్టిగారి చిన్న మరియు ఇతర కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.








## మీ సమస్య - మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా
# పుప్పాలగూడ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ నేతల ప్రజా సమస్యల సేకరణ

**మైలర్‌దేవ్‌పల్లి, జనవరి 05 (వార్త వేదిక సూర్య):**
"మీ సమస్య ఉ మా బాధ్యత, ప్రజలతో – ప్రజల కోసం" అనే నినాదంతో స్థానిక భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శ్రేణులు సోమవారం పుప్పాలగూడ బయుత్ కాలనీ పరిసర ప్రాంతంలో ప్రజా సమస్యలపై పర్యటన చేపట్టారు. ఈ కార్యక్రమం పుప్పాల గూడ నుంచి ప్రారంభమై పయనీర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పాషా కాలనీ, అల్జాపూర్ తదితర ప్రాంతాల్లో కొనసాగింది.ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను బీఆర్ఎస్ నేతల దృష్టికి తీసుకువచ్చారు. బహుళ అంతస్తుల సముదాయం అయిన ఆనందా హెూమ్స్ నిర్వాహకులు తమ వద్ద పనిచేసే కార్మికులకు రోజుకు కేవలం రూ.570 మాత్రమే వేతనం చెల్లిస్తూ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తు న్నారని. ఆరోపించారు. అలాగే, రాత్రిఉపగలు తేడా లేకుండా తిరుగుతున్న భారీ ట్రక్కుల కారణంగా చింతచెట్టు నుంచి కే.జీ.ఎన్ జిరాక్స్ వరకు రహదారి పూర్తిగా దెబ్బతిని, వాహన దారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. ట్రక్కుల వల్ల ఎగసిపడుతున్న దుమ్ము, ధూళితో పిల్లలు మరియు వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తను మునిసిపల్ ట్రక్కుల ద్వారా తరలించడంలో జాప్యం చేయవద్దని స్థానికులు అధికారులను




కోరారు.ఇదే సందర్భంగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం ఎంతో ఆదర్శవంతమైనదని స్థానిక మహిళ జంగమ్మ పేర్కొన్నారు. ఆ పథకం ద్వారా తాను పొందిన కళ్లజోడు ప్రస్తుతం పాడైపోయిందని, ఇప్పుడు తనకు సహాయం చేసే నాధుడు లేడని తన వేదనను వెల్లడించారు.అలాగే, తిరుమల హిల్స్ రహదారి కూడలిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు.ప్రజల సమస్యలను కూలంకషంగా ఆలకించిన బీఆర్ఎస్ నేతలు, సమస్యల పరిష్కారానికి ప్రజలతో మమేకమై ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు. సంబంధిత ఫిర్యాదులను మునిసిపల్ అధికారుల దృష్టికి తీస్కుల్లి, వీలైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, నాయకులు గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, మహమ్మద్ ఆరిఫ్, సుమనళిని, దేవి ప్రియ, బాబు రావు, ఎర్రోళ్ల నగేశ్ తదితరులు పాల్గొన్నారు.






## భరత్ భూషణ్ అగర్వాల్ ఫౌండేషన్ వితరణ

**చౌటుప్పల్ (దండు మల్కాపురం), జనవరి 05 (వార్త వేదిక సూర్య):** చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భరతు భూషణ్ అగర్వాల్ ఫౌండేషన్ సౌజన్యంతో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి. రమేష్ పెన్నులు, బిస్కెట్లు సోమవారం పంపిణీ చేశారు. విద్యావేత్తలు శుభకరరావు, ఆనందం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస, కెరియర్ పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తనూజ, మంజుల, పూలమ్మ, యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**చౌటుప్పల్, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** చౌటుప్పల మండలంలోని నేలపట్ల గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన చిన్నం బాలరాజు కురుమ మరియు పాలకవర్గ సభ్యులు నాయకులు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సోమవారం కలిసి ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి నేలపట్ల గ్రామ ఉపసర్పంచిగా



ఎన్నికైన చిన్నం బాలరాజు కురుమ మరియు పాలకవర్గ సభ్యులు గుర్రం ప్రమోద్ కుమార్ దబ్బటి ఉపేందర్ గౌడ్ కత్తుల సాయికుమార్ బుట్టి స్రవంతిబాలరాజు ముదిరాజ్ పార అనసూయశ్యామ్ గార్లను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పబ్బతి ఆంజనేయులు గౌడ్ సింగిల్ విండో డైరెక్టర్ పబ్బతి వెంకటేషంగౌడ్ సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బుట్టి కృష్ణ ముదిరాజ్ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బూడిద ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## డోన్ బోస్కో హైస్కూల్‌లో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

**రామన్నపేట, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** రామన్నపేట పట్టణ కేంద్రంలోని డోన్‌బోస్కో హై స్కూల్‌లో సోమవారం కరస్పాండెంట్ పీజీవి చిట్టిబాబు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా





రోడ్డు భద్రత నియమాలు పాటించి, సురక్షతంగా ప్రయాణం చేయాలని తెలియజేశారు. విద్యార్థులచే రహదారి భద్రత ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో ఏడి పి జనార్దన్ రావు, స్కూల్ టీచర్స్ అనిల్ కుమార్, నవీన్ కుమార్, సయ్యద్ ఖదీర్ ,హీన, విజయలక్ష్మి, హిరన్మయి, మత్స్యగిరి, సుజాత, శ్రీకాంత్ ,జోజప్ప, సునీత, వెంకట్ కాంబ్లే, మహాలక్ష్మి, సుమ ,జువేరియా, మాధవి, విజయ్ కుమార్, శ్రీలత, అశ్విని ,రేష్మ , వెంకన్న, లింగస్వామి, శ్రీరామ్, నర్సయ్య,లక్ష్మి , సబిత , అండాలు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# వెనిజులా దేశంపై అమెరికా దాడులను ఖండించండి..

### సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్

**చౌటుప్పల్,జనవరి 05 (వార్త వేదిక సూర్య):** వెనిజులా దేశంపై అమెరికా సామ్రాజ్యవాద ఆంక్షలతో ఉగ్రవాద దాడి చేయడం ఆ దేశ ప్రజల, ప్రజాస్వామ్య, పద్ధతిలో ఎన్నుకున్న అధ్యక్షలు మధురోను అతని భార్యను అక్రమంగా అరెస్టు చేయడాని తీవ్రంగా ఖండించాలని సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్ అన్నారు. సోమవారం రోజున స్థానిక బస్టాండ్ ఎదురుగా చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ, సిఐటియు, చౌటుప్పల్ కమిటీల ఆధ్వర్యంలో అమెరికా పెట్టుబడి దారి పోకడలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గోశిక కరుణాకర్ మాట్లాడుతూ శాంతి కాముకుడిగా గొప్పలు చెప్పుకుంటున్న నోబుల్ బహుమతి నాకే ఇవ్వాలంటూ గొప్పలు చెప్పుకుంటున్న డోనాల్డ్ ట్రంప్ పక్క దేశాలపై బాంబు దాడులకు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు. చిన్న దేశం, నిరుపేద దేశమైన, వెనిజులాపై ,పెట్రోలు, డీజిల్, నిలువలు ఉన్న కారణం చేత తమ దేశం చెప్పు చేతుల్లో నడవాలని వెనిజులాపై దాడులు చేయడం తప్పిదమని అన్నారు. వెనిజులా చుట్టూ తన సైనిక నావికా దళాలను అమెరికా ముహరించిందని స్వతంత్ర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ప్రజల తీర్పును కాలరాసే ప్రభుత్వాలను కూలదేసే కుట్రలు చేయడం అమెరికా సామ్రాజవాదానికి అలవాటుగా మారిందని వెనుజుల సహజ



వనరులపై కన్నేసి అమెరికా అక్కడి ప్రజల ఆత్మ గౌరవాన్ని స్వయం నిర్ణయం హక్కులను తుంగలో తొక్కుతూ దౌర్జన్య చర్యలకు పాల్పడుతుందని, పశ్చిమార్థ గోళంలో అమెరికా దళాల కేంద్రీకరణ మొత్తం ప్రాంతాన్ని తన నియంత్రణలోకి తీసుకురావాలని ఉద్దేశాన్ని ట్రంపు ప్రకటించడం ప్రక్క దేశాల అంతర్గత వ్యవ హారాలలో జోక్యం చేసుకోవడం అని అన్నారు. అమెరికా దురాక్రమాలకు వెంటనే ముగించాలని వెనిజులా దేశ అధ్యక్షుడు మధుర ,ఆయన సతీమణి సిలియాను, వెంటనే నిర్బంధం విడిచి పెట్టాలని ప్రపంచ ప్రజలకు అమెరికా సామ్రాజ్యవాదం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సిఐటియు జిల్లా కోశాధికారి ఎండి పాషా, జిల్లా కమిటీ సభ్యులు బత్తుల దాసు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బండారు నరసింహ, గోపగోని లక్ష్మణ్, కలకుంట్ల శివ, నెల్లికంటి నరసింహ ,ఉస్కా గుల శ్రీను, భావనలపల్లి స్వామి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి ,బోయ యాదయ్య, తూర్పునూరి మల్లేశా, ప్రకాష్ ,బొడ్డు అంజిరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించాలి

### సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ

**చండూరు, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు. సోమవారం చండూరు మండల పరిధిలోని నేర్మట గ్రామంలో బస్టాండ్ ముందు ఉన్న మురికి కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రం ప్రభుత్వం సంవత్సరాలు గడిచిన ప్రజా సమస్యలను పరిష్కరించకుండా భావద్వేగా లను రెచ్చగొడుతూ విధ్వంస పాలన కొనసాగిస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని ఆయన అన్నారు. గ్రామంలోని సిసి రోడ్లు, మురికి కాలువలు, కరెంటు స్తంభాలు, కొన్ని కాలనీలో లేవని తమ దృష్టికి వచ్చాయని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నేర్మట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం లేక చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధ్యయనం చేసి, ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని,




సమస్యలు పరిష్కరించని ఎడల పై అధికారుల దృష్టికి తీసుక వెళ్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శిఈరటి వెంకటయ్య, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శిబల్లెం స్వామి,గ్రామ ప్రజలు బురుకల సైదులు, బండమీది యాదయ్య, దాసరి రాములు, కర్నాటి యాదయ్య,నాగిళ్ల శ్రీహరి, రావుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ పురపాలక సంఘం నందు ముసాయిదా

# ఓటర్ జాబితాపై అభ్యంతరాలు సూచనలు తెలియజేయండి

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసిన కమిషనర్ జి.వెంకట్ రామ్ రెడ్డి

**చౌటుప్పల్, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, 2026 మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చౌటుప్పల్ పురపాలక సంఘ పరిధిలో రూపొందించిన ముసాయిదా ఓటర్ జాబితాపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముసాయిదా ఓటర్ జాబితాలో గల తప్పులు,చనిపోయిన వారి పేర్ల పరిశీలన, ద్వంద్వ నమోదులు, పోలింగ్ స్టేషన్ల మార్పులు తదితర అంశాలపై అభ్యంతరాలు మరియు సూచనలు తెలుపవలసిందిగా ఆయా రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేయడమైనది. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తుది ఓటర్ జాబితాను రూపొందించి



,10 వ తేదీన తుది ఓటర్ జాబితాను విడుదలచేయడం జరుగునని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నీ రాజకీయ పార్టీల




ప్రతినిధులు ,మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, రఘుపతి, హనుమాన్ ప్రసాద్..తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతా..

### నాకు ఓటు వేసి గెలిపించిన గ్రామ ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం

**మహేశ్వరం, జనవరి 05, (వార్త వేదిక సూర్య):** నాగారం గ్రామాభివృద్ధి చేయడమే నా లక్ష్యం అని నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం అన్నారు. ఈ సందర్భంగా నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను స్వయంగా ఆయన పరిశీలించారు. గ్రామ సర్పంచ్ గా గెలిపించిన గ్రామ ప్రజలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజలు నాపై నమ్మకం విశ్వాసంతో గెలిపించిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజ్, వాటర్, స్ట్రీట్ లైట్లు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. గ్రామ ప్రజలకు ప్రధాన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కారం చేస్తానని సర్పంచ్ లింగం అన్నారు. గ్రామంలో డ్రైనేజ్ చెత్తాచెదారం లేకుండా క్లీన్ అండ్ గ్రీన్ గా చేయాలని గ్రామ ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. అన్ని గ్రామాల కన్నా మన నాగారం గ్రామాన్ని ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ బండారి లింగం అన్నారు.





# వెనిజులా అధ్యక్షలు మదురోను వెంటనే విడుదల చేయాలి

### ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షలు వెంకట్ రెడ్డి డిమాండ్

**రామన్నపేట, జనవరి 5(వార్తా వేదిక సూర్య):** అంతర్జాతీయ న్యాయస్థానానికి భిన్నంగా అక్రమంగా అరెస్టు చేసిన వెనిజులా అధ్యక్షలు మదురో ను వెంటనే విడుదల చేయాలని,ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షలు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.

అంతర్జాతీయంగా న్యాయస్థానాలు ఉన్నాయని వాటికి లోబడి ఎవరైనా ఉండాలని దానికి భిన్నంగా సామ్రాజ్యవాద దోరనులను అవలంబిస్తు స్వేచ్ఛను హరింపజేసే చర్యలను ఖండించాలని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సామ్రాజ్యవాద చర్యలపై ప్రపంచవ్యాప్తంగా



విద్యార్థి, మేధావి, మహిళ, యువజనులు, ప్రపంచ శాంతిని కోరుకునే వారందరూ ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా మద్దతు ప్రకటించాలని వారు కోరారు. ప్రపంచవ్యాప్తంగా పెత్తనం చెలాయిస్తూ ఇరాన్ నుంచి వెనిజుల వరకు అహంకారాన్ని ప్రదర్శిస్తున్న అమెరికా ట్రంప్ విధానాలు ప్రపంచ శాంతికి భంగం చేసేటువంటి చర్యలకు వెంటనే ఆపాలని ఆల్ ఇండియాలో లాయర్స్ యూనియన్ ఐలు డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షలు కుక్క దువ్వ సోమయ్య, బొల్లెపల్లి కుమార్, తడక మోహన్, పాల్వంచ జగ్గయ్య ,ఎండి నేహాల్, సీసా శ్రీనివాస్ ,సూద గాని శ్రీహరి ,చింతల రాజశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరానికి డంపింగ్ యార్డ్ కావాలి

### కలెక్టర్ వినతిపత్రం అందించిన మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్

### సర్పంచ్ అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసిన పాలక వర్గం

**మహేశ్వరం, జనవరి 05 (వార్త వేదిక సూర్య):** మహేశ్వరంలో డంపింగ్ యాడ్ లేకపోవడంతో గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ గత కొంత కాలంగా చెత్తవేయడంతో గ్రామం దుర్గంధంగా మారింది. స్వచ్ఛ మహేశ్వరంలో భాగంగా గ్రామ పంచాయితీ పరిధిలో చెత్త నిల్వ చేయుటకు డంపింగ్ యార్డు కొరకై ప్రభుత్వస్థలము కటాయించ వలసిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి,ని కలిసి వినతి పత్రం అందజేసిన మహేశ్వరం గ్రామ పంచాయతీ సర్పంచ్ మునగపాటి నవీన్,పాలక వర్గం..

కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ ఉప సర్పంచ్ జొరల రమేష్ వార్డు



సభ్యులు టీంగిరికారి బేబీ, పోల్కం సునీత, అవులకాడి కిష్టమ్మ,స్వర్ణగంటి సంజీవ, ఎస్ఐ ఆజం, కాడమోని స్వాతి ప్రభాకర్, వత్తుల షాలిని, గదగూటి శ్రీశైలం, కాకి పరమేష్,ఆకుల వీరబాబు, సున్నం స్వప్న కృష్ణ, జాటవత్ రుకేశ్, రెవెళ్ల చెంద్రమౌళి గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY




# మ్యాచ్‌లను తరలిస్తే
# ఎవరికి నష్టం..?

భారత్ వేదికగా జరిగే టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని బంగ్లాదేశ్ కోరుతోంది. ముస్తఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి రిలీజ్ చేయడంతో బంగ్లా క్రికెట్ బోర్డు గుర్రుగా ఉంది. ఇప్పటికే ఐపీఎల్ ప్రసారాలను బంగ్లాదేశ్‌లో బ్యాన్ విధించింది. భద్రతా కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపించేందుకు నిరాకరిస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్ మ్యాచ్‌లు ఇప్పటికే శ్రీలంకలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. తాజాగా బంగ్లాదేశ్ తమ మ్యాచ్‌లు భారత్ వెలుపల నిర్వహించాలని ర్విస్ట్ చేసింది. అయితే ఈ విషయంపై ఐసీసీ సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. ఒకవేళ బంగ్లాదేశ్ మ్యాచ్‌లు భారత్‌లో నిర్వహించకపోతే.. బీసీసీఐకి ఏమైనా నష్టాలు ఎదురవుతాయా.. లేదా ఐసీసీ నష్టాన్ని భరిస్తుందా..

టీ20 ప్రపంచ కప్ ఈవెంట్ ఐసీసీ నిర్వహించే ఈవెంట్. ఈ ఈవెంట్‌కు సంబంధించి టైట్, స్పాన్సర్‌షిప్, ప్రసార ఆదాయం నేరుగా బీసీసీఐకి అందదు. ఐసీసీకి సంబంధించిన ఆదాయాన్ని మొత్తాన్ని బిజినెస్ కార్పొరేషన్ ఈవెంట్ నిర్వహిస్తుంది. టీ20 ప్రపంచకప్‌ను బీసీసీఐ నిర్వహించడానికి మాత్రమే పరిమితం. టీ20 ప్రపంచ కప్ నుంచి బీసీసీకి ఆదాయం మ్యాచ్-రోజుల మిగులు, ఇతర స్పాన్సర్‌షిప్‌ల నుంచి వస్తుంది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలిస్తే.. దీజజ× ఆదాయంపై మరీ గణనీయంగా ప్రభావం చూపదు. బీసీసీఐ నష్టాలను చవిచూస్తి.. అవి మ్యాచ్-రోజు ఆర్థిక వ్యవస్థకే పరిమితం అయ్యే అవకాశం ఉంది. టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి.. ఆటగాళ్లు, కోచింగ్, ఇతర సహాయక సిబ్బంది, ఇతర అధికారులకు వసతి, విమాన బుకింగ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి. బంగ్లాదేశ్ మ్యాచ్‌లు ప్రస్తుతం కోల్‌కతా, ముంబైలలో ఆడటానికి షెడ్యూల్ అయ్యాయి. బంగ్లాదేశ్ మ్యాచ్‌లు మారితే.. ఆటగాళ్లు, ఇతర సిబ్బందికి హోటల్ బుకింగ్‌లు, విమాన ప్రయాణ ఖర్చులను ఐసీసీ భరిస్తుంది. బంగ్లా మ్యాచ్‌లను తరలిస్తే.. ఆ టీమ్‌తో పోటీ పడే ఇతర జట్ల ఆటగాళ్లను కూడా వేర్వేరు వేదికల్లో హోటల్స్, విమానా టైట్స్ బుక్ చేయాల్సి ఉంటుంది. దీంతో మ్యాచ్‌లను భారత్ నుంచి తరలిస్తే.. బీసీసీఐ కంటే.. ఐసీసీకే ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ప్రపంచ కప్‌లో ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం.. బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఇటలీ, నేపాల్, వెస్టిండీస్ జట్లు గ్రూప్ జిలో ఉన్నాయి. బంగ్లాదేశ్ తన మొదటి మ్యాచ్ ఫిబ్రవరి 7న వెస్టిండీస్‌తో తలపడనుంది.

## భారత్, బంగ్లాదేశ్ మధ్య ముదురుతున్న వివాదం

బంగ్లాదేశ్ మ్యాచులను శ్రీలంకలో నిర్వహించాలని ఐసీసీకి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు విజ్ఞప్తి చేసింది. టోర్నీకి నెలరోజులు మాత్రమే సమయం ఉండటంతో బంగ్లాదేశ్ మ్యాచులను తరలించడం అంతా ఈజీ కాదన్నది నిర్వాహకులు చెబుతున్నారు. ఇంత తక్కువ సమయంలో మ్యాచులను తరలించడం అసాధ్యమని ఐసీసీ అధికారి కూడా తెలిపారు. ఎవరో కోరారని మ్యాచులను తరలిస్తే, మిగతా దేశాల టీముల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ తో ఆడబోయే దేశాల ప్లేయర్లకు ఇప్పటికే విమాన




టైట్లు, హోటళ్లు బుక్ అయ్యాయని ఐసీసీ అధికారి తెలిపారు. భారత్,పాకిస్థాన్ మ్యాచులను మాత్రం శ్రీలంకలో ఆడనించనున్నారు.ఇటీవల బీసీసీఐ ఆదేశాల మేరకు బంగ్లాదేశ్ బౌలర్ ముస్తిఫిజర్ రెహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య నడుస్తున్న వివాదం కారణంగా ముస్తాఫిజర్ రెహ్మాన్ ఐపీఎల్ ఆడితే భద్రతా సమస్యలు వచ్చే అవకాశం ఉందని బీసీసీఐ భావించినట్లు తెలుస్తోంది. ఆ కారణంగానే ముస్తాఫిజర్ రెహ్మాన్‌ను జట్టునుండి తీసివేయాలని ఆదేశాలు జారీ చేసింది.

ముస్తాఫిజర్ రెహ్మాన్‌ను తీసివేయంతో ఆదేశ క్రికెట్ బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక్క ప్లేయర్ ఆడితేనే సమస్యలు వస్తే, బంగ్లాదేశ్ క్రికెట్ టీమ్ భారత్‌లో ఆడితే ప్లేయర్లకు ఎలా భద్రత కల్పిస్తారని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రశ్నిస్తోంది. ఐపీఎల్ వేలానికి ముస్తాఫిజర్‌ను అందుబాటులో ఉంచాలని బీసీసీఐ బంగ్లా క్రికెట్ బోర్డును కోరిందని... ప్రస్తుతం అతన్ని కేకేఆర్ నుంచి ఎందుకు తీసివేశారో సమాధానం చెప్పాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారి డిమాండ్ చేస్తున్నారు. ఈ కారణాలతో ఐపీఎల్ మ్యాచులను బంగ్లాదేశ్ ప్రసారం కానివ్వమని బంగ్లాదేవ్ ప్రభుత్వ సలహాదారు అసిఫ్ నజ్రుల్ ప్రసారాల మంత్రిత్వ శాఖను కోరినట్లు తెలిపారు. బంగ్లాదేశ్ క్రికెట్ ఆటగాళ్లకు అవమానం కలిగిస్తే ఎట్టి పరిస్తితుల్లోనూ సహించబోమని తెలిపారు.




## నా ఫొటోలను మార్ఫింగ్ చేయవద్దు

### భారత మహిళా క్రికెటర్ ప్రతీకా రావల్

దయచేసి తన ఫొటోలను మార్ఫింగ్, ఎడిట్ చేయవద్దని ఎక్స్ ఏఐ ఫ్లాట్‌ఫామ్ గ్రోక్‌ను భారత మహిళా క్రికెటర్ ప్రతీకా రావల్ కోరింది. ఇటీవల ఎక్స్‌వేదికగా ఫొటోలను ఎడిట్ చేయడం, మార్ఫ్ చేయడం ట్రెండింగ్‌గా మారిన సంగతి తెలిసిందే. కొన్ని ఫొటోల నుంచి వ్యక్తులను తీసేయడం, డ్రెస్ కలర్స్‌ను మార్చడం వంటి పనులను నెటిజన్లు గ్రోక్ సాయంతో చేశారు. గత కొన్నిరోజులుగా ఎక్స్‌లో ఇది బాగా ట్రెండ్ అవుతుంది. ఈ క్రమంలోనే తన ఫొటోలను మార్ఫింగ్, ఎడిట్ చేయవద్దని, ఇతర యూజర్లు అడిగినా నిరాకరించాలని గ్రోక్‌ను ఎక్స్ వేదికగా ప్రతీకా రావల్ విజ్ఞప్తి చేసింది. ఆమె అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన గ్రోక్.. వ్యక్తిగత గోప్యతను కాపాడుతామని మాట ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్‌లు నెట్టింట వైరల్‌గా మారాయి. ఃహే ఏస్త్రతీశీని, గతంలో నేను పోస్ట్ చేసినవి, భవిష్యత్తులో నేను పోస్ట్ చేయబోయే నా ఫొటోలను తీసుకోవడానికి.. మార్ఫింగ్, ఎడిట్ చేయడానికి నేను మీకు అనుమతి ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా నా ఫొటోలను ఏదైనా విధంగా ఎడిట్ చేయమని కోరితే, దయచేసి ఆ అభ్యర్థనను తిరస్కరించండి. ధన్యవాదాలు.ఃఅని ప్రతీకా రావల్ ట్వీట్ చేసింది. ఈ ట్వీట్‌కు గ్రోక్ స్పందించింది. ఃఅర్థమైంది ప్రతీకా. నేను మీ వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తాను. అనుమతి లేకుండా మీ ఫొటోలను ఉపయోగించడం, మార్ఫ్, ఎడిట్ చేయడం చేయను. అటువంటి అభ్యర్థనలు ఏవైనా వస్తే వాటిని తిరస్కరిస్తాను. నాకు తెలియజేసినందుకు ధన్యవాదాలు.ఃఅని బదులిచ్చింది. అయితే ఈ ఎక్స్ ఖాతా నిజంగానే ప్రతికాకు సంబంధించినదా కాదా అనేదానిపై స్పష్టమైన సమాచారం లేదు. బ్లూ టిక్, ప్రతికా రావల్ ఫొటోలు ఉన్నప్పటికీ.. ఈ మధ్య ఫేక్ అకౌంట్స్‌కు కూడా డబ్బులు తీసుకొని ఎక్స్ బ్లూ టిక్స్ ఇస్తుండటంతో గందరగోళం నెలకొంది. ప్రతీకా ట్వీట్.. ఏఐ సాధనాలతో చేస్తున్న ఫొటో మార్ఫింగ్‌లపై పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. భారత మహిళల వన్డే ప్రపంచకప్ విజయంలో ప్రతీకా రావల్ కీలక పాత్ర పోషించింది. గాయంతో సెమీఫైనల్‌తో పాటు ఫైనల్‌కు దూరమైన ఆమె.. 6 ఇన్నింగ్స్‌ల్లో 51.33 సగటుతో 308 పరుగులు చేసింది. న్యూజిలాండ్‌పై శతకం సాధించడంతో పాటు ఆస్ట్రేలియా 75 పరుగులతో సత్తా చా టింది. బంగ్లాదేశ్‌తో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆమె చీల మండ, మోకాలి గాయాలకు గురైంది. ప్రస్తుతం ఆ గాయాల నుంచి కోలుకుంటుంది.

## సౌతాఫ్రికాలో వైభవ్ సూర్యవంశీ రచ్చ

సౌతాఫ్రికా గడ్డపై భారత అండర్-19 ్రెప్టెన్ వైభవ్ సూర్యవంశీ పరుగుల సునామీ సృష్టించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే తన అద్భుత బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను తనవైపు తిప్పుకున్న ఈ కుర్రాడు, తాజాగా ప్రోటీస్ బౌలర్లను వణికించాడు. బెనోనీలో జరిగిన రెండో వన్డేలో కేవలం 24 బంతుల్లోనే 68 పరుగులు చేసి టీమిండియాకు భారీ ఆరంభాన్ని ఇచ్చాడు. సౌతాఫ్రికా నిర్దేశించిన 246 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ్రెప్టెన్ వైభవ్ సూర్యవంశీ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. ఆరంభం నుంచే సిక్సర్లతో విరుచుకుపడ్డ వైభవ్, మైదానం నలుమూలలా బంతుల్ని తరలించాడు. ఈ క్రమంలో కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని రిషబ్ పంత్ పేరిట ఉన్న భారత రికార్డును తిరగరాశాడు. మొత్తం 24 బంతుల్లో 10 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 68 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అంటే అతను చేసిన మొత్తం పరుగుల్లో 64 పరుగులు కేవలం బౌండరీల (10 సిక్సర్లు ం 1 ఫోర్) ద్వారానే రావడం విశేషం. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా అండర్-19 జట్టును భారత బౌలర్లు కట్టడి చేశారు. జేసన్ రౌల్స్ (114) సెంచరీతో పోరాడినప్పటికీ, మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. భారత స్పిన్నర్ కిషన్ సింగ్ 8.3 ఓవర్లలో 46 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. దీంతో సౌతాఫ్రికా 245 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్ఎస్ అంబరీష్ రెండు వికెట్లు తీయగా, దీపేష్, కనిష్క్, ఖిలన్ పటేల్ తలో వికెట్ పడగొట్టారు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే ఆస్ట్రేలియా అండర్-19 జట్టుపై అత్యంత వేగవంతమైన సెంచరీ చేసి రికార్డు నెలకొల్పాడు. ఇప్పుడు సౌతాఫ్రికాలోనూ అదే ఫామ్‌ను కొనసాగిస్తూ జూనియర్ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నాడు. వైభవ్ ఇచ్చిన మెరుపు ఆరంభంతో భారత్ విజయం దిశగా దూసుకెళ్తోంది. కేవలం 11 ఓవర్లలోనే టీమిండియా 100 పరుగుల మార్కును దాటేసిందంటే వైభవ్ విధ్వంసం ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.



### ఇకపై వైట్‌వాష్‌లు ఉండవు..

## టెస్టుల్లో సర్జికల్ స్ట్రైకులే..

భారత టెస్టు క్రికెట్‌లో గత కొంతకాలంగా ఎదురవుతున్న పరాజయాలకు అడ్డుకట్ట వేయాలని టీమిండియా టెస్ట్ ్రెప్టెన్ శుభ్‌మన్ గిల్ నడుం బిగించారు. సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 0-2తో వైట్‌వాష్‌కు గురైన తర్వాత, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకూడదని గిల్ ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. దీని కోసం ఆయన ఏకంగా బీసీసీఐ ముందు ఒక భారీ డిమాండ్ ఉంచారు. గిల్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత 13 నెలల కాలంలో టీమిండియా సొంతగడ్డపై రెండుసార్లు టెస్ట్ సిరీస్‌లలో ఘోరంగా ఓడిపోయింది. ముఖ్యంగా సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఓటమి బీసీసీఐని ఆలోచనలో పడేసింది. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు, టీమ్ లీడర్‌షిప్ గ్రూప్‌తో బోర్డు నిర్వహించిన సమీక్ష సమావేశంలో శుభ్‌మన్ గిల్ తన మనసులోని మాటను బయటపెట్టారు. కేవలం నాలుగు రోజుల ముందు ప్రాక్టీస్ చేసి మైదానంలోకి దిగడం వల్ల ఫలితాలు రావడం లేదని, అందుకే ఇకపై ప్రతి టెస్ట్ సిరీస్‌కు ముందు కనీసం 15 రోజుల ట్రైనింగ్ క్యాంప్ ఉండాలని గిల్ డిమాండ్ చేశారు. గతేడాది ఆసియా కప్ ముగిసిన కేవలం 4 రోజులకే టీమిండియా వెస్టిండీస్‌తో టెస్ట్ మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. అలాగే దక్షిణాఫ్రికాతో సిరీస్ ముందు కూడా గిల్, ఇతర టెస్ట్ స్పెషలిస్ట్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా నుంచి వచ్చిన 4 రోజులకే మ్యాచ్‌లోకి దిగారు. ఇలాంటి బిజీ షెడ్యూల్ వల్ల ఆటగాళ్లకు రెడ్ బాల్ క్రికెట్‌కు అలవాటు పడే సమయం దొరకడం లేదని గిల్ వాదిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం.. గిల్ ప్లానింగ్ పట్ల బీసీసీఐ, సెలెక్టర్లు చాలా సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. గిల్ విజన్, క్లారిటీ చూసి బోర్డు కూడా అతనికి మద్దతుగా నిలిచే అవకాశం ఉంది. భారత జట్టు బిజీ షెడ్యూల్ మధ్య 15 రోజుల క్యాంప్ నిర్వహించడం కత్తి మీద సామే. అయితే, దీని కోసం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఇప్పుడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)ను వాడుకోవాలని బోర్డు భావిస్తోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పరిమిత ఓవర్ల సిరీస్‌లలో బిజీగా ఉంటే, ఈ రెడ్ బాల్ క్యాంప్ బాధ్యతలను వివిఎస్ లక్ష్మణ్ కు అప్పగించే ఆలోచనలో కూడా బోర్డు ఉంది. గిల్ డిమాండ్ గనుక అమలైతే, భారత టెస్ట్ జట్టు మరింత పటిష్టంగా తయారవుతుందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.



# విదేశాల్లో ది రాజాసాబ్' మేనియా

## విడుదలకు ముందే భారీగా టిక్కెట్ల అమ్మకాలు





ప్రభాస్ హీరోగా,దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'ది రాజాసాబ్' ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సంచలనాలకి సంబంధించిన సంకేతాలు ఇస్తోంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ మూవీకి విదేశీ మార్కెట్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు బలంగా ప్రారంభమయ్యాయి. ప్రభాస్ క్రేజ్‌కు మరోసారి నిదర్శనంగా, ఉత్తర అమెరికాలో ఇప్పటివరకు 17,500కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. అలాగే యూకే మార్కెట్‌లో కూడా 17,500కు పైగా ప్రీ-సేల్స్ నమోదు కావడం విశేషం. 2026 జనవరి 8న ప్రారంభమయ్యే ప్రీమియర్ షోలకే ఇంత భారీ స్పందన రావడం, సినిమా ఓవర్సీస్‌లో బలమైన ఓపెనింగ్ రాబోతుందనే సంకేతాలను ఇస్తోంది. దర్శకుడు మారుతి ఈ సినిమాను దాదాపు మూడేళ్ల పాటు శ్రమించి తెరకెక్కించినట్టు సమాచారం. పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు ప్రభాస్‌ను సరికొత్తగా చూపించాలనే లక్ష్యంతో ఈ సినిమా రూపొందించబడింది. 'బాహుబలి', 'సలార్' లాంటి ఇంటెన్స్ పాత్రల తర్వాత ప్రభాస్‌ను లైట్ హార్టెడ్, ఫుల్ ఎంటర్‌టైనర్‌లో చూడాలన్న అభిమానుల ఆశలను 'ది రాజాసాబ్' తీర్చబోతుందనే అంచనాలు ఉన్నాయి.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ.జి. విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. 'ది రాజాసాబ్' సినిమాను తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రభాస్‌కు ఉన్న మార్కెట్‌ను పూర్తిగా వినియోగించుకునేలా మేకర్స్ రిలీజ్ ఎలాన్ చేస్తున్నారు. మొత్తానికి, అడ్వాన్స్ బుకింగ్‌లతోనే ఓవర్సీస్‌లో హీట్ పెంచుతున్న 'ది రాజాసాబ్'? సంక్రాంతి రేసులో పెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ అభిమానులు మాత్రం ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ షేక్ అవుతుందని గట్టిగా నమ్ముతున్నారు.




# స్విమ్మింగ్ షూట్ కోసం నీళ్లలోనే ఉండిపోయా

సినీ ప్రియులకు పెద్ద పండగ సంక్రాంతి ఈ యేడాది 'ది రాజాసాబ్'తో మొదలుకానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే పాటలు, ప్రచార చిత్రాలు ఆసక్తిని రెట్టింపు చేయగా తాజాగా మాళవికా మోహనన్ కొన్ని విషయాలు పంచుకున్నారు. 'నటీనటుల మధ్య సన్నివేశాలు బాగా రావాలంటే కెమిస్ట్రీ ముఖ్యం. ఈ చిత్రంలో ప్రభాస్‌కు, నాకు మధ్య చాలా సన్నివేశాలు ఉన్నాయి. ఇందులో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర. నా సోలో సీన్ ఒకదాన్ని మూడు రోజులు పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో షూట్ చేశారు. ఆ మూడు రోజులు దాదాపు రోజుకు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. నామీద మొసలి దాడి చేస్తున్నట్లు నటించాల్సిన సీన్. ఒకవైపు చలికి చర్మం మొత్తం మొద్దుబారిపోతున్న ఫీలింగ్ కలిగేది. అదే సమయంలో మొసలి దాడి చేస్తున్నట్లు ఎక్స్‌ప్రెషన్స్ పెట్టాలన్నారు. ఆ నీళ్లు కూడా దారుణంగా ఉన్నాయి. అందరూ అందులోకి దిగి షూట్ చేస్తున్నారు. పెయింట్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ అందులో ఉన్నాయి. ఆ నీటిలోనే 3 రోజులు షూట్ చేశాం. అదొక వింత అనుభవం' అని మాళవికా మోహనన్ అన్నారు. ఇకపోతే హారర్ ఫాంటసీ కామెడీ చిత్రంగా 'రాజాసాబ్' రానుంది. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదని దర్శకుడు మారుతి తెలిపారు. 15 ఏళ్ల తర్వాత ఆడియన్స్ వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారని చెప్పారు. ఇందులో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కనిపించనున్నారు. సంజయ్‌దత్, బొమన్ ఇరాని, జరీనా వహాబ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

**- మాళవికా మోహనన్**

# ఎన్టీఆర్ లెవల్‌కు తగ్గట్లుగా ప్రశాంత్ నీల్ ప్లాన్



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్ హీరోగా సినిమా చేస్తున్నాడు అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అందుకే ఈ మూవీకి సంబంధించిన చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లోనే వైరల్ అవుతోంది. ఈ సినిమాను పూర్తిగా ఇంటర్నేషనల్ లెవల్లో తెరకెక్కించాలని ప్రశాంత్ నీల్ గట్టిగా నిర్ణయించుకున్నారట. తన అభిమాన నటుడు అయిన ఎన్టీఆర్‌కు కెరీర్‌లో మరిచిపోలేని బ్లాక్‌బస్టర్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎక్కడా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. చిన్న చిన్న డిటైలింగ్ వరకు కూడా పర్ఫెక్షన్ కావాలనే ఆలోచనతో ప్రతి సీన్‌ను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా దీనిని అత్యంత ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇటీవల నిర్మాత రవి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం కూడా ఈ సినిమాపై క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉదాహరణగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన పాత్రల మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అంతేకాదు, ఎన్టీఆర్‌తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ఈ షెడ్యూల్‌లోనే తెరకెక్కించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఎన్టీఆర్ మరోసారి విదేశాలకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే షెడ్యూల్‌తో సినిమా టాకీ పార్ట్ దాదాపుగా పూర్తవుతుందని టాక్. గ్రాండ్ స్కేల్‌లో, భారీ యాక్షన్ ఎపిసోడ్‌లతో ఈ మూవీని ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా అందించేందుకు టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంటర్నేషనల్ లెవల్లో సెట్ అయ్యే కథకు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ గత సినిమాల్లో హీరో ఎలివేషన్స్, మాస్ యాక్షన్‌కు పెద్ద పీట వేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కేవలం హీరోయిజం మాత్రమే కాకుండా బలమైన ఎమోషన్స్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటనలోని ఎమోషనల్ డెప్త్‌ను కొత్త కోణంలో చూపించాలనే ప్రయత్నంలో ప్రశాంత్ నీల్ ఉన్నారు.

# అట్లీతో ముగింపు దశలో అల్లు మూవీ

## లోకేశ్ కనగరాజ్‌తో మరో మూవీకి బన్నీ ప్లాన్



టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీతో చేస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌తో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తున్నారు. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి విజువల్స్, హాలీవుడ్ టెక్నాలజీతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది దసరా కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. బన్నీ మాస్ ఇమేజ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించబోతున్న ఈ కథ, అట్లీ మార్క్ ఎమోషన్‌తో పాటు గ్రాండ్ యాక్షన్‌ను కలబోస్తుందని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా పూర్తయ్యాక అల్లు అర్జున్ తదుపరి అడుగు ఏమిటన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ప్రధాన చర్చగా మారింది. తాజా సమాచారం ప్రకారం, యూత్‌కి, మాస్‌కి కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ గ్యాంగ్‌స్టర్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో బన్నీ సినిమా దాదాపు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. అట్లీ మూవీ షూటింగ్ ఆగస్టు నాటికి ముగిస్తే, ఆ వెంటనే లోకేశ్ ప్రాజెక్ట్‌పై బన్నీ ఫోకస్ పెడతారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, అట్లీ?అల్లు అర్జున్ సినిమా డిజిటల్ హక్కులపై కూడా భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్ర ఓటీటీ రైట్స్ కోసం ప్రముఖ డిజిటల్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ఆఫర్ పెట్టినట్లు సమాచారం. ఈ డీల్ విలువ వందల కోట్లలో ఉండొచ్చన్న ప్రచారం ఇండస్ట్రీని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రిలీజ్‌కు ముందే ఇలాంటి రేంజ్ బిజినెస్ జరగడం బన్నీ మార్కెట్ స్టామినాకు నిదర్శనంగా చెప్పుకుంటున్నారు.మరోవైపు, తన తాజా చిత్రం 'కూలీ'పై వచ్చిన విమర్శలపై దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఇటీవల స్పందించారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్నానని, ఎక్కడ తడబడ్డామో విశ్లేషించుకున్నానని తెలిపారు. తదుపరి సినిమాల్లో మరింత బలమైన కంటెంట్‌తో ముందుకు వస్తానని స్పష్టం చేశారు. దీంతో అల్లు అర్జున్‌తో ఆయన చేయబోయే సినిమా మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందన్న అంచనాలు మరింత పెరిగాయి. మొత్తానికి అట్లీతో ఒక గ్రాండ్ సైన్స్ ఫిక్షన్ విజన్, లోకేశ్ కనగరాజ్‌తో ఒక రఫ్ అండ్ రియల్ ప్రాజెక్ట్ ఈ రెండు కాంబినేషన్లతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**